నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 11-3-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 193 | పేజీలు: 4 | వెల: రూ.1/-

కరోనా తొలి కేసులో నెగెటివ్ రిపోర్ట్స్

ఊపిరి పీల్చుకున్న వైద్యులు

హైదరాబాద్,మార్చి10(ఆర్ఎన్ఎ): తెలంగాణలో వెలుగు చూసిన తొలి కరోనా కేసులో బాధిత యువకుడి తాజా శాంపిల్స్ నెగెటివ్ అని వచ్చాయి. మరోసారి నిర్ధారణకు అతడి నమూనాలను పుణెలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపించనున్నట్లు సమాచారం. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన ఈ యువకుడు దుబాయ్ వెళ్లి వచ్చి కరోనా బారినపడ్డాడు. అనంతరం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు.ప్రస్తుతం ఆ యువకుడి ఆరోగ్యం మెరుగుపడిందని, చేరినప్పటితో పోల్చుకుంటే చాలావరకూ నయమైందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆ యువకుడు ఇంటి భోజనం తింటున్నట్లు చెప్పారు. ఒక వారంలో ఆ యువకుడిని డిశ్చార్జ్ చేసే అవకాశమున్నట్లు గాంధీ వైద్యులు స్పష్టం చేశారు.

హిమాచల్ ప్రదేశ్‌లో అదుపుతప్పి లోయలో పడ్డ బస్సు

లోయలో పడ్డ బస్సు

ఐదుగురు మృతి

సిమ్లా,మార్చి10(ఆర్ఎన్ఎ): హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని చంబా జిల్లాలోని చెహ్లీ గ్రామ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హిమాచల్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పోరేషన్‌కు చెందిన బస్సు లోయలో పడటంతో జరిగిన ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా, 35 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతులు యోగేశ్‌కుమార్(47), పూజా కుమారి(28), రాజీవ్‌కుమార్(37), మణిరామ్(33), దావాత్ అలీ(30)లుగా గుర్తించారు. చంబా నుంచి డెహ్రాడూన్ వెళుతున్న బస్సు ఉదయం 6:45 గంటలకు ప్రమాదానికి గురైంది.

నేటినుంచి మళ్లీ బడ్జెట్ సమావేశాలు

సమస్యలపై నిలదీసేందుకు కాంగ్రెస్ సిద్ధం
ఎదురుదాడితో తిప్పికొట్టనున్న ప్రభుత్వం
విపక్షాలకు దీటైన జవాబు ఇచ్చే విధంగా పక్కా ప్రణాళిక

హైదరాబాద్,మార్చి10(ఆర్ఎన్ఎ): తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బడ్జెట్‌పై చర్చ ఈనెల 11నుంచి అంటే బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఆదివారం బడ్జెట్ ప్రవేశపెట్టిన తరవాత వరుసగా రెండురోజులు సెలవు ప్రకటించారు. బుధవారంనుంచి తిరిగి ప్రారంభం కానున్న సమావేశాల్లో బడ్జెట్ పద్దులపై చర్చ జరుగనుంది. మరోవైపు సమస్య ఏదైనా చర్చించడానికి అధికార పక్షం సర్వసన్నద్ధగా ఉంది. అందుకే ప్రతిపక్షాలపై ఎదురు దాడికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత సమావేశాల్లో కూడా ఇదే దృశ్యం ఆవిష్కృతం అయ్యింది. ముఖ్యంగా ప్రాజెక్టుల తీరుపై విపక్షాల తీరును ఎండగట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇకపోతే గతంలో అసెంబ్లీ సమావేవాలంటే అధికార పక్షం వణికపోయేది. ఎలాంటి సమస్యలు లేవనెత్తుతారో అన్న భయం ఉండేది. అందుకే ప్రతిపక్షాలదే అసెంబ్లీలో పైచేయిగా మారేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. తెలంగాణ ఏర్పడ్డ తరవాత అధికార పక్షందే పైచేయి అవుతోంది. అధికార పక్షమే ఎదురు దాడి చేస్తోంది. దీనికితోడు విపక్షాల వద్ద పెద్దగా సబ్జక్ట్ లేకుండా పోతోంది. ప్రభుత్వాన్ని నిలదీయగలిగే స్థాయి నేతలు కూడా లేకుండా పోయారు. కాంగ్రెస్, బిజెపిల్లో సమర్థంగా మాట్లాడి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే స్థాయిలో విపక్షనేత లేక పోవడం పెద్ద మైనస్‌గా చెప్పుకోవాలి. అయితే ఇవన్నీ కప్పిపుచ్చుకునేందుకు ప్రతిపక్షాలు కూడా అధికార పక్షం తీరును ఎండగట్టేలా వ్యూహ రచన చేస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టులకు తాము వ్యతిరేకం కాదంటూనే అవినీతిని మాత్రం ఉపేక్షించేది లేదంటూ విపక్షాలు తేల్చి చెప్తున్నాయి. విపక్షాలు అనేక అంశాల్లో విమర్శలకు దిగితే ఎలాంటి సమాధానాలు ఇవ్వాలనే దానిపైనా తెరాస ఇప్పటికే ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిసింది. శాసనసభ బడ్జెట్ సమావేశా ల్లో

ప్రభుత్వ ప్రగతిని ఘనంగా చాటడంతో పాటు విపక్షాలపై ఎదురుదాడి వ్యూహాన్ని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర సమితి నిర్ణయించింది. బడ్జెట్‌లో వ్యవసాయం,సంక్షేమ రంగానికి ప్రాధాన్యమిచ్చారు. అలాగే అన్ని రంగాలకుకేటాయింపుల పెంచారు. అయినా బిసి సంక్షేమాన్ని విస్మరించారని విమర్శలు వచ్చాయి. అయితే ప్రధానంగా వెనకబడిన తరగతులు, చేతివృత్తులకు భారీగా నిధులను కేటాయించామని బిసి మంత్రులు అన్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను వివరించాలనే భావనతో ప్రభుత్వముంది. టిఆర్ఎస్‌లో సమస్యలపై మాట్లాడే ఉన్న సత్తాగల నాయకులు అనేకులు ఉన్నారు. అందుకే అధికార పక్షానికి ఇదొక అసెట్ కానుంది. బడ్జెట్ పద్దులపైనా చర్చ సందర్భంగా మంత్రులు జవాబిచ్చేందుకు వీలుగా వారితో మరింత కసరత్తు చేయించాలని కేసీఆర్ నిర్ణయించారు. వాటిపై ప్రతీ రోజు అధ్యయనం చేయాలని సూచించారు. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ బడ్జెట్‌లో రుణమాఫీకి ఆఖరు విడత నిధులివ్వాల్సి ఉంది. రుణమాఫీ ని ఏకకాలంలో కాకుండా దశలవారీగా విడుదల చేయడంతో రైతులు పడ్డ ఇబ్బందులు, గిట్టుబాటుధరలు రాని అంశాలను

లేవనెత్తనున్నారు. కంది మిర్చి ధరలు ప్రధానంగా ప్రస్తావనకు రానున్నాయి. ఫీజుల రీఎంబర్స్‌మెంట్ అమలు, ఉద్యోగాల భర్తీ, ప్రకటనల్లో గందరగోళం అంశాలపై చర్చకు సిద్ధమయ్యారు. సాగునీటి ప్రాజెక్టులకు కేటాయించిన నిధుల్లో సగం కూడా వ్యయం కాకపోవడం, ప్రాజెక్టుల భూసేకరణ, అంచనాలు పెరగడం, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు వ్యయం సహా వివిధ అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించింది. ఇకపోతే ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను అమలుచేయడంలో తెరాస ప్రభుత్వం విఫలమైందని, వాటిపైనే నిలదీయాలని యోచిస్తోంది. పేదలకు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం, విద్యార్థులకు రుసుముల చెల్లింపు, దళితులకు 3 ఎకరాల భూమి పంపిణీ, రుణమాఫీ, గిరిజనులు, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు వంటి హామీల అమలుపై ప్రశ్నించనున్నారు. హామీల అమలు, దళితులకు మూడెకరాల భూమి, బీసీ ఉప ప్రణాళిక, రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణంపై చర్చకు పట్టుపట్టాలని భాజపా నిర్ణయించింది. సింగరేణి ఒప్పంద కార్మికులు, సీఎంపై సభా హక్కుల ఉల్లంఘన విషయాల్ని కీలక అంశాలుగా తీసుకోనుంది. ఆయా అంవాలపై సమాధానం ఇచ్చేందుకు ప్రభుత్వం కూడా సిద్ధంగా ఉంది. ఇక ఎంఐఎం ఎప్పుడూ పాతబస్తీ సమస్యలనే ప్రధానంగా ప్రస్తావించనుంది. దీనికితోడు టిఆర్ఎస్‌తో స్నేహపూర్వకంగానే ఉంటోంది. శాసనసభలో ప్రభుత్వానికి, మంత్రులకు, సభ్యులకు అవసరమైన సమాచారాన్ని జాప్యం లేకుండా అందించాలని సిఎస్ సోమేశ్ కుమార్ ఇప్పటికే అధికారులకు సూచించారు.

స్వల్పంగా తగ్గిన పెట్రో ధరలు

న్యూఢిల్లీ,మార్చి10(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా పెట్రోల్ ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. రష్యా, సౌదీ అరేబియాల మధ్య నెలకొన్న చమురు యుద్ధం నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు భారీగా తగ్గిన విషయం తెలిసిందే. దీంతో భారతదేశంలో పెట్రోలు, డీజిల్ వినియోగదారులకు స్వల్ప ఊరట లభించింది. వివిధ నగరాల్లో పెట్రోల్ పై 24 నుంచి 27 పైసలు, డీజిల్ పై 25 నుంచి 26 పైసల మేర ధర తగ్గిస్తున్నట్టు ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు తెలిపాయి. దీంతో ఎనిమిది నెలల కనిష్ఠానికి పెట్రో ఉత్పత్తుల ధరలు తగ్గాయి.ఇక ఢిల్లీలో లీటర్ పెట్రోల్ రూ. 70.59కి చేరుకోగా, డీజిల్ ధర లీటర్ రూ. 63.26కి దిగివచ్చింది. హైదరాబాద్ లో లీటర్ పెట్రోల్ ధర రూ. 75.04గా, డీజిల్ లీటర్ ధర రూ. 68.88 వద్ద కొనసాగుతోంది. ఈ ధరలు సమీప భవిష్యత్తులో మరింతగా తగ్గుతాయని చమురు రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం

హైదరాబాద్,మార్చి10(ఆర్ఎన్ఎ): టిఆర్ఎస్ పాలనతో ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని భాజపా శాసనసభాపక్షనేత రాజాసింగ్ పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమం య్యిందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ప్రజల మధ్య విభజనను వ్యతిరేకిస్తామని తెలిపారు. వానకు దెబ్బతిన్న పంటలను కొనుగోలు చేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులకు కలిగిన నష్టాన్ని, రైతాంగానికి సంబంధించిన అంశాల్ని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తావిస్తామన్నారు.

జిహెచ్ఎంసిలో పెరుగుతున్న ఖర్చులు

ఆదాయ మార్గాల కోసం ప్రత్యేక కసరత్తు

హైదరాబాద్,మార్చి10(ఆర్ఎన్ఎ): అంతర్గత వనరుల ద్వారా ఆదాయ మార్గాలను పెంపొందించు కోవటానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని వచ్చిన సూచనల మేరకు గ్రేటర్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు పన్నుల తగ్గింపు వంటివి చేపట్టిన ప్రభుత్వం ఇప్పుడు ఇంటి పన్నులను భారీగా పెంచే కసరత్తుచేస్తోంది. అలాగే నీటి బిల్లులు కూడా పెరగగలవని సమాచారం వస్తోంది. పెంచితే వ్యతిరేకత వస్తుందని టిఆర్ఎస్ శ్రేణులు సిఎం కెసిఆర్‌కు సూచించే అవకాశం ఉంది. మంత్రి కెటిఆర్ కూడా ఇంటిపన్నులను అమాంతంగా పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నారని సమాచారం. ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్సులు వంటి పన్నులను ఏమాత్రం పెంచకుండా వ్యవస్థలోని లోటుపాట్లను సరిచేయడం ద్వారా రూ.500 కోట్ల అదనపు ఆదాయాన్ని పొందడానికి జీహెచ్ఎంసీ చర్యలు చేపడుతోంది. ఇందుకు అనుసరించాల్సిన విధివిధానాలపై కమిషనర్ డాక్టర్ బి.జనార్దన్‌రెడ్డి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్తుల నుంచి పన్నును పూర్తిస్థాయిలో రాబట్టడం, రూ.1200 లోపు ఆస్తిపన్ను చెల్లిస్తున్న భవనాలను తిరిగి మదింపు చేయడం, నిర్మాణం పూర్తయిన ఇళ్లకు పన్నును నిర్ధారించడం, ట్రేడ్ లైసెన్స్ పునరుద్ధరణ రుసుంను పక్కాగా వసూలు చేయడం, లైసెన్స్ లేని వ్యాపారులను గుర్తించి జారీచేయడం ద్వారా ఆదాయం పెంచుకోవలని నిర్ణయించినట్లు తెలిసింది. పక్కాగా లెక్కగట్టి అదనపు ఆదాయం పొందాలని చూస్తున్నారు.

నిరుద్యోగ ప్రకటనపై తప్పుడు సమాచారం

ప్రభుత్వంపై కోదండరామ్ మండిపాటు

హైదరాబాద్,మార్చి10(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల పాలిట శాపంగా మారిందని తెజస అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. నిరుద్యోగ సమస్యపై తమ పార్టీ పోరాటం చేస్తుందని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి అరెస్ట్‌ను ఖండిస్తున్నామని.. కావాలనే ఆయనపై నాన్‌బెయిలబుల్ కేసు పెట్టి జైలుకు పంపారన్నారు. నిరుద్యోగ సమస్యపై అసెంబ్లీలో సీఎం కేసీఆర్ మాట్లాడిన తీరు చాలా బాధ కలిగించిందని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌ను పరిశీలిస్తే ప్రజలపై మరింత భారం పడే విధంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలపై దృష్టి పెట్టాలని కోదండరాం డిమాండ్ చేశారు. ఉద్యోగాల భర్తీపై అసెంబ్లీలో ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని ఆయన ఆరోపించారు. నిరుద్యోగుల విషయంలో సీఎం కేసీఆర్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. విద్యారంగానికి చాలా అధ్వాన్నరీతిలో నిధులు కేటాయించారన్నారు. అనుమతిలేని ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని చెప్పారు. ప్రభుత్వానికి బాధ్యత గుర్తు చేస్తే రెచ్చగొట్టడం ఎలా అవుతుందో చెప్పాలని కోదండరాం వ్యాఖ్యానించారు. త

మధ్యప్రదేశ్‌లో ముదిరిన రాజకీయ సంక్షోభం

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి భారీ కుదుపు
పార్టీని వీడిని సీనియర్ నేత జ్యోతిరాదిత్య సింధియా
పార్టీకి రాజీనామా సమర్పించిన సింధియా
ప్రధాని మోడీ,అమిత్‌షాలతో భేటీ
బిజెపిలో చేరేందుకు రంగం సిద్ధం
సోనియా అధ్యక్షతన అత్యవసరంగా కాంగ్రెస్ నేతల భేటీ
పార్టీ నుంచి జ్యోతిరాదిత్య సింధియా సస్పెన్షన్
కమల్‌నాథ్ సర్కార్ కుప్పకూలడం ఖాయం అంటున్న విశ్లేషకులు
భోపాల్‌లో పరిస్థితిని సమీక్షిస్తున్న బిజెపి సీనియర్ నేతలు

న్యూఢిల్లీ,మార్చి10(ఆర్ఎన్ఎ): మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభంలో పడింది. 17మంది ఎమ్మెల్యేలతో పాటు సీనియర్ నేత జ్యోతిరాదిత్య సింధియా జారుకోవడంతో అక్కడ మళ్లీ బిజెపి హస్తగతం అయ్యేలా పరిణామాలు వేగంగా మారాయి. కమలం దెబ్బకు కమల్‌నాథ్ గద్దె దిగి...కమల నాథులు గద్దెనెక్కేలా వేగంగా పావులు కదుపుతున్నారు. బొటాబొటి మెజార్టీతో పాలన సాగిస్తున్న కమల్‌నాథ్ తన స్వయంకృతాపరాధం..ఒంటెత్తు పోకడలతో ప్రభుత్వాన్ని చేజార్చుకోబోతున్నారు. మాధవరావు సింధియా తనయుడు, కాంగ్రెస్ యువనేత జ్యోతిరాదిత్య సింధియా అనూహ్యంగా బిజెపిలో చేరేందుకు రంగం సిద్ధం అయ్యింది. ఈ మేరకు ఆయన ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షాలతో చర్చించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా సమర్పించారు. మొత్తంగా సోమవారం నుంచి మధ్యప్రదేశ్ రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. కాంగ్రెస్ పార్టీని అధికారం నుంచి గద్దె దించడానికి రంగం సిద్ధమైంది. కర్ణాటక తరహా రాజకీయాలకు మధ్యప్రదేశ్ బీజేపీ తెరతీసింది. సీఎం పదవి తనకు దక్కలేదనే అసంతృప్తిలో ఉన్న జ్యోతిరాదిత్య సింధియాను బీజేపీ విజయవంతంగా తమ వైపు తిప్పుకుంది. మంగళవారం ఉదయం ప్రధాని మోదీతో జ్యోతిరాదిత్యసింధియా భేటీ అయ్యారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా దగ్గరుండి ఆయనను మోదీ వద్దకు తీసుకెళ్లారు. మరోవైపు పరిణామాలపై సోనియా నేతృత్వంలో సీనియర్ నేతలు ఢిల్లీలో అత్యవసర సమావేశంలో చర్చించారు. సింధియాను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం బీజేపీలో సింధియా చేరే అవకాశం ఉంది. కాంగ్రెస్‌కు చెందిన 20 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కూడా తెలుస్తోంది. వీరు రాజీనామా చేస్తూ కమల్ నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది.దీంతో అసెంబ్లీలో అవిశ్వాసం పెట్టేందుకు బిజెపి రంగం సిద్ధం చేస్తోంది. అసమ్మతినేత జ్యోతిరాదిత్య సింధియా అమిత్ షాతో కలసి ప్రధాని మోడీని ఆయన నివాసంవద్ద కలిశారు. ఈలోగా వేరే కుంపటి పెట్టిన ఎమ్మెల్యేల జాడ తెలియడంలేదు. సోమరవారం అర్ధరాత్రి నుంచి మొదలైన హైడ్రామా ఇంకా కొనసాగుతూనే ఉంది.

జ్యోతిరాదిత్య సింధియాకు కనీసం11 మంది ఎమ్మెల్యే మద్దతుంది. ఆరుగురు మంత్రులూ ఆయన వెంటున్నారు. వారితో కలసి సింధియా బీజేపీలో చేరితే కమలానికే అధికారమొస్తుంది. ఒకవేళ అసమ్మతి ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసినా సభలో బలం తగ్గుతుంది. ఇప్పటికే అవిశ్వాస తీర్మానానికి బీజేపీ సిద్ధమైంది. అంటే... సరైన బలం లేక ప్రభుత్వం కుప్పకూలడం ఖాయంలాగే కనిపిస్తోంది. సింధియాను ఒప్పించి అధికారాన్ని కాపాడుకోవాలన్న కాంగ్రెస్ ప్రయత్నం చేసినా లాభం లేకుండా పోయింది. కాంగ్రెస్ ఎత్తులకు ముందే బిజెపి పైఎత్తులు వేయడంతో ఆయన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసేశారు. కమల్‌నాథ్ ప్రభుత్వానికి వచ్చిన ప్రమాదమేదీలేదని,. కమల్ నాథ్ ప్రభుత్వం కొనసాగుతుందన్న విశ్వాసాన్ని ప్రదర్శించినా, బీజేపీ వ్యూహాలను తట్టుకోవడం కాంగ్రెస్ వల్ల కావడం లేదు. నిజానికి, మధ్యప్రదేశ్ లో బీజేపీదే పైచేయి. మహారాష్ట్ర భంగపాటు క్లళెదురుగా ఉంది కాబట్టి, ఇంకోసారి పరువుపోకుండానే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కుప్పకూల్చడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్న తర్వాతనే అమిత్ షా, సింధియాను మోడీ దగ్గరకు తీసుకెళ్లారు.

తండ్రి జయంతి రోజే సింధియా కొత్త నిర్ణయం

మధ్యప్రదేశ్‌లో బలాబలాలను పరిశీలిస్తే మొత్తం సీట్లు 228 ఉండగా అందులో కాంగ్రెస్ బలం 114 సీట్లు. నిజానికి మొత్తం అసెంబ్లీ సీట్లు 230. ఇద్దరు ఎమ్మెల్యేలు చనిపోవడంతో సీట్ల సంఖ్య 228కి తగ్గిపోయింది. కాంగ్రెస్‌కు నలుగురు స్వతంత్రులు, ఇద్దరు బిఎస్పీ ఎమ్మెల్యేలు, ఎస్పీ ఎమ్మెల్యే మద్దతుంది. బీజేపీకి ఉన్న బలం 109 సీట్లు. మంగళవారమే జ్యోతిరాదిత్య సింధియా తండ్రి మధవరావు 75వ జయంతి. కాంగ్రెస్ పార్టీలో తండ్రి కీలక నేతగానే కాకుండా చాలాకాలం కేంద్రమంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్ ఇప్పటికీ ఆయన గురించి గొప్పగానే చెప్పుకొంటోంది. అలాంటిది ఆయన జయంతి రోజునే కొడుకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేయబోతున్నారు. మరోవైపు బీజేపీ భోపాల్‌లో సమావేశమై అన్నిలెక్కలు సరిగా వేసుకొంటోంది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తాము కూల్చినట్లు కాకుండా, అంతర్గత కుమ్ములాటల వల్లే కుప్పకూలినట్లు ఎత్తుగడలు వేస్తున్నారు. కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమార్, మాజీ సిఎం శివరాజ్ సింగ్ చౌహాన్ అక్కడే ఉండి అన్ని వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. ఆయన ఇంతకు ముందే హోంమంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్, మాజీ సిఎం శివరాజ్ సింగ్ చౌహాన్ లను కలిశారు. ఇకపోతే ఈ పరిణామాలకు ముందే జ్యోతిరాధిత్య అనుచరులైన 17 మంది ఎమ్మెల్యేలు గత కొద్ది రోజులుగా అదృశ్యమయ్యారు. జ్యోతిరాధిత్య సింధియా ఆ 17 మంది ఎమ్మెల్యేలను బీజేపీ పాలిత కర్ణాటక రాష్ట్రంలోని ఓ స్టార్ హోటల్‌లో ఉంచినట్టు తెలుస్తోంది. జ్యోతిరాధిత్య కూడా కాంగ్రెస్ నేతలకు ఎవరికీ అందుబాటులో లేరు. అతని ఫోన్ స్విచాఫ్ చేసి ఉంది. అతనికి స్పైస్ ఫ్లూ వచ్చినట్టు కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ వ్యంగ్యంగా చెప్పారు. ఆ 17 మంది ఎమ్మెల్యేలతో పాటు మరికొందరు కూడా కాంగ్రెస్ వీడినున్నట్టు తెలుస్తోంది. వారిలో ఆరుగురు మంత్రులు కూడా ఉన్నారు. వారంతా తమ పదవులకు రాజీనామాలు సమర్పించడానికి సిద్ధంగా ఉన్నారు.

పావులు కదుపుతున్న బిజెపి నేతలు

మరో వైపు మంగళవారం సాయంతం 6 గంటలకు బీజేపీ ఎమ్మెల్యేల సమావేశం ఏర్పాటు చేశారు. బీజేపీ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, జ్యోతిరాధిత్య సింధియాల నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలుస్తోంది. మొత్తం 230 అసెంబ్లీ స్థానాలు గల మధ్యప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీకి 114 మంది, బీజేపీకి 107 మంది ఎమ్మెల్యేలున్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి 116 మంది ఎమ్మెల్యేలు అవసరం కావడంతో బీఎస్పీ నుంచి ఒకరు, ఎస్పీ కి చెందిన ఒకరు, మరో నలుగురు ఇండిపెండెంట్ సభ్యుల మద్దతు తీసుకొని మొత్తం 120 మంది ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. వారిలో ముగ్గురు ఇప్పటికే తమ రాజీనామా లేఖలను స్పీకర్ కు పంపారు. అయితే ఇప్పుడు 17 మంది కూడా రాజీనామా చేస్తే ఆ పార్టీ బలం 107 కు పడిపోతుంది. బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం సులభవవుతుంది. దీనిపై బీజేపీ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పందిస్తూ అది కాంగ్రెస్ అంతర్గత విషయమని, దాని గురించి తానేమి మాట్లాడనని అన్నారు. ప్రభుత్వాన్ని కూల్చాల్సిన పని తమకు లేదన్నారు. బీజేపీ నేత నరోత్తమ్ మిశ్రా మాట్లాడుతూ కాంగ్రెస్ నేత జ్యోతిరాధిత్య సింధియా బీజేపీ లోకి వస్తే సాధరంగా ఆహ్వానిస్తామని చెప్పారు. సింధియా పెద్ద నాయకుడు. ఆయన తమ పార్టీలో చేరితే తప్పకుండా ఆహ్వానిస్తామన్నారు. మరో వైపు జ్యోతిరాధిత్య సింధియా పార్టీని వీడకుండా ఉండేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు సెంటిమెంట్ ను ప్లే చేసినప్పటికీ సక్సెస్ కాలేదు. మంగళవారం రోజే జ్యోతిరాధిత్య సింధియా తండ్రి మాధవరావు సింధియా జయంతి. మాధవరావ్ సింధియా 9 సార్లు ఎంపీగా చేశారు. శతాబ్ది ఎక్స్ ప్రెస్ మొదటి సారిగా ప్రారంభించింది కూడా మాధవ్ రావ్ సింధియానే. ఆయన పార్టీకి, దేశాని ఎంతో సేవ చేశారంటూ కొనియాడుతూ సోషల్ మీడియా ట్విట్టర్ లో ట్వీట్లు పెట్టారు.తండ్రి జయంతి రోజు ఆయన ఆశయాలకు విరుద్ధంగా జ్యోతిరాధిత్య సింధియా బీజేపీ చేరడం సరికాదన్నట్టుగా సూచనలు చేశారు.

జ్యోతిరాదిత్య సింధియా వర్గంలో ఉన్న 19మంది ఎమ్మెల్యేలు తమ రాజీనామాలను చూపుతున్న దృశ్యం

సింధియావర్గం 19మంది ఎమ్మెల్యేల రాజీనామా

స్పకర్‌కు రాజీనామా లేఖలు పంపిన నేతలు
కేంద్రమంత్రివర్గంలో సింధియా చేరే అవకాశం

న్యూఢిల్లీ,మార్చి10(ఆర్ఎన్ఎ): మధ్యప్రదేశ్‌లో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారిపోయాయి. సోమవారం తన వర్గం ఎమ్మెల్యేలతో బెంగళూరుకు మకాం మార్చిన కాంగ్రెస్ నేత జ్యోతిరాదిత్య సింధియా.. మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ కావడం, ఆ వెంటనే కాంగ్రెస్‌కు రాజీనామా చేయడం చకచకా జరిగిపోయాయి. సింధియా రాజీనామా చేసిన వెంటనే.. తన వర్గపు 19మంది ఎమ్మెల్యేలు తమ పదవి రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా లేఖలను స్పీకర్‌కు పంపించారు. వీరిలో ఆరుగురు మంత్రులు కూడా ఉన్నారు. దీంతో కమల్‌నాథ్ ప్రభుత్వం సంక్షోభంలో పడిపోయింది.

మధ్యప్రదేశ్ అసెంబ్లీలో మొత్తం సభ్యుల సంఖ్య 230. అయితే ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఒక బీజేపీ ఎమ్మెల్యే మృతి చెందడంతో ప్రస్తుత సభ్యుల సంఖ్య 228కి చేరింది. కాంగ్రెస్ 114, బీజేపీ 107, స్వతంత్రులు 4, బీఎస్పీ 2, ఎస్పీ ఒక ఎమ్మెల్యే బలం కలిగిఉంది. కాంగ్రెస్‌కి స్వతంత్రులు, మిత్రపక్షాలు మద్దతు ఇవ్వడంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 19మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేయడంతో కమల్‌నాథ్ ప్రభుత్వం మైనార్టీలోకి జారుకుని సంక్షోభంలో పడింది. మరోవైపు మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బీజేపీ పావులు కదుపుతోంది. మరోసారి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కే మధ్యప్రదేశ్ వగ్గాలు అప్పగించాలని బీజేపీ అధిష్టానం భావిస్తోంది. అయితే బిజెపి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. మరోవైపు సింధియాను రాజ్యాసభకు పంపడం ద్వారా ఆయనకు కేంద్రమంత్రి పదవి అప్పగించవచ్చని తెలుస్తోంది. దీనిపై కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మాజీ మంత్రి నట్వర్ సింగ్ స్పందించారు. జోతిరాదిత్య కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరనుండటం తనకేమి ఆశ్చర్యం కలిగించలేదన్నారు. జ్యోతిరాదిత్యాను బీజేపీ రాజ్యసభకు పంపి కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకోనున్నట్లు తెలిపారు. అతడి తండ్రి మాధవరావ్ సింధియా బ్రతికి ఉన్నట్లయితే ప్రధానమంత్రి అయ్యేవాడని నట్వర్ సింగ్ పేర్కొన్నారు.

పాఠశాల బస్సు బోల్తా: 15మందికి గాయాలు

పెద్దపెల్లి,మార్చి10(ఆర్ఎన్ఎ): ఓ పాఠశాలకు చెందిన టాటా ఏసీ వాహనం బోల్తా పడటంతో 15 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి.

పెద్దపల్లి జిల్లా హనుమంతుని పేట రైల్వే గేట్ వద్ద మాస్టర్ సిద్దార్థ స్కూల్‌కు చెందిన టాటా ఏసీ వ్యాన్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 15 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. క్షతగా

లోకం రంగులమయం..!

లోకం రంగులమయం. ఆ రంగులే లేకపోతే అంతా అయోమయం. రంగుల్లేని ప్రపంచాన్ని అసలు ఊహించలేము. పసిపాప బోసినవ్వులో ఉన్న తెల్తదనం, నుదిటి మీద బొట్టు నులివెచ్చని సూర్యోదయం. నల్లని కురులు, పచ్చని సిరులు, నీలాకాశం, ఎర్రని పువ్వులు, అన్నీ కలిసి జగమంతా రంగురంగులే. అలాగని తెల్లనివన్నీ పాలు కావని, నల్లనివన్నీ లోపాలు కావని ఆ మాటకొస్తే ఏ రంగు దేనిని సూచిస్తుందో చెప్పగలగడం పెద్ద కష్టమేమీ కాదు కానీ, కానీ ఆ సూచనలో ఎంత నిజముంది అనేది తెలుసుకోవడం చాలా కష్టం. నీలాకాశం ఎంత రమణీయంగా ఉన్నా నల్లని మబ్బులు దట్టంగా అలుముకుని చల్లని వర్ణధార కురిపిస్తే తెల్లబోయిన రైతు బతుకు పచ్చగా మారుతుంది. తెల్లని పాలే కదా బిడ్డను బతికిస్తుంది. ఆ మురిపాలతోనే ప్రాణం లేచివస్తుంది. అందరి నరనరాల్లో ప్రవహించే రక్తం ఎర్రనిదే అయినా ముందుతరం వారిలో ఆలోచనను, యువతరాన్ని ఆవేశాన్ని కలుగజేస్తుంది. అంతమాత్రానికి అది ఎరుపు కాకపోతుందా? కాషాయాలు ధరించి అనుభవాలతో నిండిపోయినా జీవన మూలాల చరమ సంధయ ఊదారంగును తలపిస్తుంది. ఆడపిల్లను గులాబీ రంగుతో పోల్చుతారు కవులు. ఆ గులాబీని అంటిపెట్టుకున్న ఉండే ముల్లుకు రంగును ప్రత్యేకంగా ఎవరూ చెప్పలేకపోయారు. అబ్బాయి ఇష్టపడితే సిగ్గుతో అమ్మాయి బుగ్గ ఎర్రబడుతుంది. ప్రేమలో గులాబీలు, సిగ్గులు, బుగ్గలు, మొగ్గలూ లేవు. ద్రవాలు, ద్రవ్యాలు, తప్ప వాటి రంగు

నేటినిజం
బుధవారం 11-3-2020

లు కళ్ళెదుట కనిపిస్తూనే ఉంటాయి.

మన జీవితాలన్నీ ఏదో విధంగా ఏవేవో రంగులతో ముడిపడినవే. కాకుంటే కొన్ని రంగులు అప్పుడే కొట్టిన సున్నంలాగా ధగధగా మెరిసిపోతుంటే, మరికొన్ని వెలిసిపోయి కనిపిస్తాయి. ముఖ్యంగా సామాన్యుల బతుకుబండి మట్టిరంగు. వారి ప్రతి అడుగులో అదే పరిమళం. మరి అసామాన్యుల సంగతులన్నీ కృత్రిమ రంగులు. హుంగులు, ఎర్రబుగ్గ కార్లు, పచ్చనోట్లు, నీలి బతుకులూ ఉంటాయి. రక్తం ఎర్రదైనా దానికి గ్రూపులుంటాయి. ఆ మర్మం తెలుసుకుని రక్తంలోని రంగుల్ని విడదీయ గలిగినవారే నీలాల నింగిని తాకే మహా హర్మ్యాలు కట్టుకోగలుగుతారు. అటువైపు ఇటు వెళ్ళే నల్లమబ్బుల్ని వెనుకగుమ్మానికి కట్టేసి పచ్చనోట్ల పొలాల్లో పసిడి వానలు కురిపించుకోగలుగుతారు. ఇక్కడ మరో విషయం ఒకటుంది. రంగులకు , రాజకీయాలకు చాలా దగ్గర సంబంధం. దాదాపు ప్రతి రాజకీయ పార్టీ తన గుర్తుగా ఏదో ఒక రంగు ఎంచుకుంది. ఎందుకంటే చారిత్రక, రాజకీయ, ఆర్థిక, సామాజిక, భౌగోళిక కారణాలంటూ ఎన్నో కథలు వినిపిస్తాయి. కోణాలు చూపిస్తాయి. వాటివెనుక ఉన్న రంగులు సిసలైనవి వేరే ఉంటాయి. మొదట ఉన్న రంగు కాకుండా రాను రాను అసలు రంగులు బయటపడుతుంటాయి కూడా. ప్రజల కళ్ళకు ఎప్పటికప్పుడు మాయతెంలు కప్పి పబ్బం గడుపుకోవాలంటే అవసరాలకు అనుగుణమైన రంగులు ఎంపిక చేసుకోవాలిసిందే! పరిస్థితులను బట్టి రంగులు మార్చాల్సిందే! అందుకే ఊసరవెల్లి సృష్టిలోని మానవులందరికీ ఒక మార్గదర్శి. మరోవిధంగా ఒక ప్రతీక. ఎరుపురంగునే ఎక్కువగా ఎంచుకుంటున్న సృష్టి చివరకు ఏ రంగును శాశ్వతంగా నిలుపుకుంటుందో అనేది గమనించాల్సిందే!!

డబుల్ ఇళ్లపైనే అందరి ఆశ

హైదరాబాద్, మార్చి 10:పేదలకు గూడు కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన గృహనిర్మాణ పథకం అభాసు పాలవుతోంది. ఏటా లక్షల్లో ఇళ్లకునిధులు కేటాయిస్తున్నా లబ్దిదారుల సంఖ్య ఏటేటా పెరుగుతోనే ఉంది. ఇకపోతే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గృహనిర్మణపథకం కింద చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అక్రమాలకు నిలయంగా మారింది. ఇందులో వేలకోట్లు దుర్వినియోగం అయినట్లు సిఎం కెసిఆర్ స్వయంగా ప్రకటించి.. సిబిసిఐడి దర్యాప్తునకు ఆదేశించారు. ఆ దర్యాప్తు ఏమయ్యిందో తెలియదు. కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించిన కెసిఆర్ కూడా దానిపై పెద్దగా దృష్టి సారించడం లేదు. తాజాగా తెలంగాణలో పెద్ద ఎత్తున డబుల్ ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఇది నిరంతర ప్రక్రియ అని సిఎం కెసిఆర్ ప్రకటించారు. ఆ మేరకు ఇల్ల నిర్మాణం జరుగుతోంది. గతంతో పోలిస్తే ఇళ్లను ఆదర్శంగా నిర్మించడం విశేషం. అయితే సంక్షేమ పథకాల అమలులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నా ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉండిపోతోంది. నిధులు ఖర్చవుతున్నా ఫలితం మాత్రం అంతంత మాత్రంగానే ఉంటోంది. పేదలను పైకి తీసుకుని వచ్చేందుకు చేపడుతున్న పథకాలు సక్రమంగా అమలు కాకపోవడం లేదా అందులో లోపాలు లేదా, అవినీతి కారణంగా పథకాలు పొందిన లబ్దిదారులు పేదరికం నుంచి బయటపడ లేక పోతున్నారు. గృహనిర్మానాన్ని తీసుకుంటే కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా లక్షల సంఖ్యలో ఇళ్లు నిర్మిస్తూనే ఉన్నాయి. అయినా మళ్లీ లక్షల సంఖ్యలో లబ్దిదారులు పుట్టుకుని వస్తున్నారు. తెలంగాణ,ఎపిల్లో గృహనిర్మాణ పథకం గతంలో అభాసుపాలయ్యింది. వేలకోట్లు ఖర్చు చేస్తున్నా నిధులు ఎక్కడ పోతున్నాయో అర్థం కావడం లేదు. పథకాలను కూడా సమీక్షించుకుని ముందుకు సాగకుంటే సమస్యలు తప్పవని గుర్తించాలి. ఇప్పటిదాకా కట్టించిన ఇళ్లు ఎక్కడ పోయాయాన్నది అర్థం కాకుండా పోతున్నది. కాంగ్రెస్ హయాంలో లక్షల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టించినా వాటి జాడలేకుండా పోయింది. అలాగే కేంద్రం కూడా పేదరిక నిర్మూలన పథకం కింద కడా ఇళ్లను కట్టించింది. అయినా సరిపోవడంలేదు. తాజాగా తెలంగాణలో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల పథకం దాదాపు అన్నినియోజకవర్గాల్లో శరవేగంగా సాగుతోంది. సీఎం కేసీఆర్ ఎన్నికల హామీలో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు డబుల్ ఇళ్లకు తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లతోపాటు అన్ని హంగులతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వమూ నిర్మించని విధంగా సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు స్థలం సేకరించి అర్హులందరికీ ఒకే ప్రదేశంలో ఒక్కో ఇంటికి 7నుంచి 8 లక్షలు ఖర్చు చేసి ఇళ్లు నిర్మిస్ఉన్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు గేటెడ్ కమ్యూనిటీ కాలనీలను తలపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ గృహాలు పేదలకు వరంగా మారాయి. పేదలకు గూడు కలిపించాలనే ఉన్నత లక్ష్యంతో పలుగ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను శరవేగంగా ప్రారంభించారు. సీఎం కేసీఆర్ నిర్ణయంతో పేదలు కూడా గౌరవంగా జీవించటానికి ఇళ్లు నిర్మించి ఇస్తున్నారు. చాలాచోట్ల ప్రజలు వీటిని స్వాధీనం చేసుకుని గౌరవంగా బతుకుతున్నారు. దీనితో సీఎం కేసీఆర్‌కు దేశమంతా కీర్తిప్రతిష్టలు వస్తున్నాయి. ఇక్కడ ఇపథకాన్ఇన పలు రాష్ట్రాలు ఇప్పటికే అధ్యయనం చేశాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్దిదారులను ఎంపిక చేస్తున్నారు. అయితే ఇలా లబ్దిదారులు ఇళ్లు పొందుతున్నా మళ్లీ కొత్తగా ఏటా లక్షల్లో పుట్టుకుని వస్తున్నారు. ఎపిలో ఉగాది నాటిని ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కూడా సిఎం వైఎస్ జగన్ నిర్ణయించారు. అక్కడా వేలాది ఎకరాలు సేకరించి పట్టాలు ఇచ్చేందుకు గృహనిర్మాణ పథకం చేపట్టారు. సర్కారు లెక్కల ప్రకారం ప్రతి ఏడాది పెద్ద సంఖ్యలోనే ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. వందల కోట్ల రూపాయలు దీని కోసం ఖర్చు చేస్తూనే ఉన్నారు. అయినా నిలువ నీడలేని నిర్భాగ్యుల సంఖ్య పెరుగుతోందే గాని తగ్గడం లేదు. పథకం గొప్పగా ఉన్నా అమలులో చిత్తశుద్ధి లోపించడం వల్లనే సంపూర్ణంగా లక్ష్యం సాధించక పోవడమే దీనికి కారణం. సమైక్య రాష్ట్రంలో వైఎస్ రాజశేర్‌రెడ్డి ప్రభుత్వంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై తెలుగుదేశం పార్టీ ఈ ఆరోపణలే చేసింది. టిఆర్ఎస్ కూడా తెలంగాణలో దర్యాప్తు చేపట్టగా అనేక లొసుగులు బయటపడ్డాయి. అంటే గతంలో ఇళ్ల నిర్మాణం అంతా కాగితాల్లోనే సాగింది. ఎపిలో తెలుగుదేశం ప్రభుత్వం ఎన్టీఆర్ గృహ నిర్మాణం పేరుతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వేర్వేరుగా పథకాలను ప్రారంభించింది. ఇకపోతే పథకంలో అక్రమాలను తొలగించి పక్కాగా అమలు చేయడానికి ఇళ్లు లేని వారిని గుర్తించేందుకు సమగ్ర సర్వే నిర్వహించాలని తాజాగా జగన్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులకు ఆదేశాలకు జారీ చేయడం జరిగింది. వేల సంఖ్యలో ఇళ్ల నిర్మాణం జరిగినా జిల్లా కలెక్టర్ల కార్యాలయాల్లో నివాస స్థలాల కోసం పేద ప్రజానీకం సంవత్సరాల తరబడి చేసుకున్న దరఖాస్తులు కుప్పలు, కుప్పలుగా పేరుకుపోతున్న తీరు చూస్తుంటే పథకం అములులో ఎక్కడో లోపం జరిగిందన్నది వాస్తవం. వీటికి పరిష్కారం చూపడం ద్వారా అపోహలు తొలగించాలి. సొంతింటి కోసం సామన్యులు ఎదుర్కొంటున్న ఈ సమస్యను పరిష్కరించడానికి బదులుగా ఓటు బ్యాంకు రాజకీయాల కోసం పాలకవర్గ పార్టీలు వెంపర్లాడటం వల్లనే పథకం నీరుగారుతోంది.

భద్రాద్రిలో పక్కాగా శ్రీరామనవమి వేడుకలు

–ఉత్సవాల నిర్వహణపై సమీక్షించిన మంత్రి పువ్వాడ

భద్రాద్రి కొత్తగూడెం,మార్చి10(ఆర్ఎన్ఎ): భద్రాచలంలో శ్రీరామ నవమి వేడుకలపై మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం, శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాలకు హాజరయ్య భక్తులకు ఎలాంటి లోటు రాకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శాఖల వారీగా ఏర్పాటు చేసిన కమిటీలకు విధులపై కార్యాచరణ ప్రణాళిక అందజేశామని దాని ప్రకారం అధికారులు విధులు నిర్వహించాలని తెలిపారు. ఆలయాల కమిటీ చైర్మన్‌లు, కన్వీనర్లతో అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు.

సమావేశంలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ, జడ్జీ చైర్మన్ కోరం కనకయ్య, ఎమ్మెల్యేలు పోదెం వీరయ్య, మెచ్చ నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎంవీరెడ్డి, ఐటీడీఏ పీఓ గౌతమ్, ఏఎస్పీ రాజేశ్ చంద్ర పాల్గొన్నారు. ఇదిలావుంటే భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో స్వామి డోలోత్సవం, వసంతోత్సవం, కల్యాణ తలంబ్రాలు కలిపే పక్రియ అంగరంగ వైభవంగా జరిగింది. పాల్గుణ ఫాల్గుణిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. తొలుత అర్చకులు రామయ్యను పెళ్లికొడుకుగా, సీతమ్మను పెళ్లి కూతురుగా అలంకరించారు. అంతరాలయం నుంచి స్వామి శేష మాలికలను మంగళవాయిద్యాలతో చిత్రకూట మండపానికి చేరుకున్నారు. అక్కడ విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం జరిపారు. బియ్యంపై పుణ్య జలాలను చల్లారు. తొమ్మిది మంది వైష్ణవ ముత్తైదువులు రోలు, రోకలిలో లక్ష్మి, సరస్వతిని ఆవాహనం చేసి రోకలికి కంకణధారణ చేసి పసుపు కొమ్ములు రోళ్లలో దంచారు. అనంతరం పసుపు, కుంకుమలు, తొమ్మిది రకాల ద్రవ్యాలతో ఆవాహనం చేసి 1108మంది భక్తురాళ్లు తలంబ్రాలను కలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తయారు చేసిన గోటి తలంబ్రాలను ఈ తలంబ్రాలలో కలిపారు. వైష్ణవులు ఈ తలంబ్రాలను ఉత్సవ మూర్తుల వద్దకు తీసుకురాగా, దృవమూర్తులకు చూపించి భద్రపరిచారు. అనంతరం ఉత్సవ పెరుమాళ్లకు అభిషేక తిరుమంజనం నిర్వహించారు. తలంబ్రాలు కలుపు పక్రియలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా యాగశాలలో మహా పూర్ణాహుతి జరిపి మూలమూర్తుల వద్ద మహా కుంభప్రోక్షణ నిర్వహించారు. అనంతరం కనుల పండువగా డోలోత్సవం జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు హోలీ ఆడి సంబురాలు జరుపుకున్నారు. మొత్తంగా భద్రాద్రిలో ఉత్సవశోభ అలముకుంది.

వూహాన్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పర్యటన

బాధితులకు పరామర్శ..అధికారులతో సమీక్ష

వ్యాధి తగ్గుముఖం పట్టిందని సంకేతాలు

బీజింగ్,మార్చి10(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ పుట్టిన వూహాన్‌లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మంగళవారం పర్యటించారు. ఇక్కడే పుట్టి ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న ప్రాంతంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు వైద్య, సైన్యాధికారులు, కమ్యూనిటీ వర్కర్లు, పోలీసులతో ఆయన భేటీ అయ్యారు. అదే విధంగా... హౌషెన్షన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కరోనా బాధితులను పరామర్శించినట్లు ప్రభుత్వ మీడియా పేర్కొంది. కాగా కరోనా వైరస్ భయం వెంటాడుతున్న వేళ.. ప్రజల్లో ధైర్యం నింపేందుకే ఆయన వుహాన్‌లో పర్యటించినట్లు తెలుస్తోంది. కరోనా తొలిసారిగా బయటపడిన వుహాన్‌కు వెళ్లడం ద్వారా దేశంలో తలెత్తిన విపత్కర పరిస్థితులు సాధారణ స్థితికి చేరకున్నాయనే సంకేతాలు ఇవ్వడంతో పాటుగా... కరోనా వ్యాప్తి తగ్గుముఖం పట్టిన విషయాన్ని ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కరోనా వ్యాప్తి చెందిన తర్వాత అధ్యక్షుడు వుహాన్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఇక ప్రపంచ దేశాల అధినేతలకు పెనుసవాలుగా పరిణమించిన కరోనా వైరస్ తొలిసారిగా చైనాలోని వుహాన్ నగరంలో బయటపడిన విషయం తెలిసిందే. ఈ ప్రాణాంతక వైరస్ ధాటికి ఇప్పటిదాకా చైనాలో 3,136 మందికి పైగా మరణించగా... లక్షలాది మంది దాని బారిన పడి క్వారంటైన్‌లో వేదన అనుభవిస్తున్నారు. అయితే గత కొన్ని రోజులుగా చైనాలో ఈ వైరస్ తగ్గుముఖం పడుతున్నట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గడిచిన 24 గంటల్లో చైనాలో దేశ వ్యాప్తంగా 19 మంది కరోనా కేసులు నమోదుకాగా.. 17 మరణాలు సంభవించాయని ప్రభుత్వ మీడియా మంగళవారం పేర్కొంది. అదే విధంగా వుహాన్‌లో కేవలం 2 కరోనా పాజిటివ్ కేసులు మాత్రమే నయోదయ్యాయని తెలిపింది. కరోనా కారణంగా వుహాన్‌లో విధించిన ఆంక్షలను సడలిస్తున్నట్లు పేర్కొంది.

ఫీజు రియంబర్స్‌మెంట్ కోసం ఎదురుచూపు

కళాశాల యాజమాన్యాల ఒత్తిడితో విద్యార్థుల్లో ఆందోళన

అనంతపురం,మార్చి10(ఆర్ఎన్ఎ): ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు మంగళం పాడతారా అన్న అనుమానాలను విద్యార్థుల వ్యక్తం చేస్తున్నారు. విద్యాసంవత్సరం ముగుస్తున్నా... ఇప్పటివరకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అనుమానాలు బలపడుతున్నాయి. విద్యాదీవెనతోనే సరిపెట్టడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల పేర్లను జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెనగా మార్చిన విషయం తెలిసిందే. ఈ విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారనే విమర్శ ఆ వర్గాల నుంచి వినిపిస్తుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో కళాశాలల యాజమాన్యాలు ఆందోళనకు గురవుతున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల కోసం కళాశాలల యాజమాన్యాలు ఎదురుచూస్తున్నాయి. మరికొద్ది రోజుల్లో విద్యాసంవత్సరం ముగియనుండగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఇప్పటికీ మంజూరు కాలేదు. దీంతో అటు కళాశాల యాజమాన్యాలు, ఇటు విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనవు తున్నారు. జిల్లాలో 2019–20 విద్యాసంవత్సరానికి సంబంధించి రూ. 196 కోట్లు ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సి ఉంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలపై ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో కళాశాల యాజమాన్యాలు తీవ్రస్థాయిలో అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం ఫీజు రీయిం బర్స్‌మెంట్‌కు సంబంధించి పేర్లు మార్చడంలో చూపుతున్న శ్రద్ధ నిధులు మంజూరులో చూపడం లేదన్న ఆక్రోశం ఆ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో కళాశాలల నిర్వహణ యాజమాన్యాలకు తలకు మించిన భారంగా మారుతోంది. లెక్చరర్లకు సకాలంలో జీతాలు చెల్లించలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దీంతో కళాశాల యాజమాన్యాలు అప్పులు చేసి కళాశాల లను నడుపుకోవాల్సి వస్తోందని వాపోతున్నాయి. ప్రభుత్వం నిధులను మంజూరు చేయక పోవడంతో కళాశాలల నిర్వహణ భారంగా మారుతోంది. అధ్యాపకుల నెలసరి వేతనాలు చెల్లించడం కష్టతరమవుతోందన్నారు. రెండు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ రావడం లేదంటున్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థుల్ని ఫీజులుకోసం ఒత్తిడి చేస్తున్నాయి. ఫీజులు చెల్లించే స్థితిలో తల్లి దండ్రులు లేరు. ఫీజులు చెల్లించాలని ఒత్తిడి ఉండడంతో ఎలా చెల్లించాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న నాలాంటి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు మంజూరు చేయక పోవడంతో కళాశాల యాజమాన్యాల నుంచి ఒత్తిడి అధిక మవుతోంది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించి విద్యార్థులు, కళాశాలలను ఆదుకోవాలని కోరుతున్నారు.

కార్పోరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాల

యూట్యూబ్ ద్వారా పాఠ్యాంశాల బోధన

వరంగల్,మార్చి10(ఆర్ఎన్ఎ): కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా విద్యా ప్రమాణాలను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలు అరుదుగా కనిపిస్తాయి. ప్రైవేటు పాఠశాలల్లోనే కాదు.. ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ప్రవేశాల కోసం క్యూ కట్టాల్సిందే అనే స్థితికి తీసుకువచ్చి 'నో అడ్మిషన్' అనే బోర్డును సైతం ఏర్పాటు చేసింది కరీమాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల. నాణ్యమైన విద్యా బోధన చేస్తూ.. ప్రైవేటు పాఠశాలను తలదన్నేలా మౌళిక వసతులు కల్పిస్తూ.. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడా, సాంస్కృతిక అంశాల్లో సైతం ప్రత్యేక శిక్షణను ఇస్తూ.. ఇప్పుడు డిజిటల్ పాఠ్యాంశాలవైపు అడుగులు వేస్తోంది కరీమాబాద్ ప్రాథమిక పాఠశాల. ప్రధానోపాధ్యాయుడు దొనికెన శ్రీకాంత్ ప్రత్యేక చొరవతో ఎన్ఆర్ఐల సహకారంతో 4, 5, 6 తరగతుల విద్యార్థుల పాఠ్యాంశాల బోధనను యూట్యూబ్ చానల్ ద్వారా అందుబాటులోకి తెస్తోంది. ప్రభుత్వ పాఠశాలే అయినప్పటికీ ప్రవేటుకు ధీటుగా అన్ని హంగులతో కూడిన వసతులు ఉన్నాయి. 200 డ్యూయల్ డెస్కులతో ప్రతి విద్యార్థి పూర్తి యూనిఫామ్‌తో కనిపిస్తారు. పాఠశాల ప్రాంగణం ఆహ్లాదంగా ఉండి మధ్యాహ్న భోజనం తర్వాత పిల్లలు చేతులు కడుక్కునేందుకు అధునాతన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పాఠశాలలో 480 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ విద్యా బోధనకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇప్పటికే ఈ పాఠశాల విద్యార్థులకు 6 కంప్యూటర్లతో కంప్యూటర్ విద్యా బోధన చేస్తున్నారు. ఎల్ఈడీ టీవీల ద్వారా ఆన్‌లైన్ పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. ప్రత్యేక స్లైడ్‌లను ఉపయోగించి ప్రొజెక్టర్ ద్వారా పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ స్మార్ట్ ఫోన్లు వినియోగిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేలా ఎన్ఆర్ఐ సహకారంతో యూ ట్యూబ్ చానెల్‌ను ప్రారంభిస్తున్నారు. పాఠశాలలో చదువుకుంటున్న 3, 4, 5 తరగతులకు చెందిన పాఠ్యాంశాలను ఉపాధ్యాయులు రూపొందించిన ప్రత్యేక వీడియోలను ఈ యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తారు. దీంతో వివిధ కారణాలతో పాఠశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థులు.. జీపీఎస్ కరీమాబాద్ యూ ట్యూబ్ చానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసి పాఠ్యాంశాలను వీక్షించవచ్చును. వాయిస్ ఓవర్‌తో పాటు పాఠ్యాంశానాకి చెందిన వీడియోలు ఇందులో ఉంటాయి. పాఠశాలలో పేద విద్యార్థులు చదువుకుంటున్నారు. వారికి కార్పొరేట్ తరహాలో విద్యను అందించాలన్నదే మా లక్ష్యం. అందుకోసం మే ము ప్రయత్నం చేస్తున్నాము. కోర్సుక్యూ అనే సంస్థను సంప్రదించాము. వారు యూట్యూబ్ చానల్ రూపకల్పనకు సహకరించారు. యూట్యూబ్ ద్వారా పాఠ్యాంశాలు మిస్ అయిన విద్యార్థులు మా పాఠశాల యూట్యూబ్ ద్వారా పాఠ్యాంశాలు వినే అవకాశాన్ని కల్పిస్తున్నాము. మా పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనే ఆశయంతో ముందుకు వెళుతున్నామని ప్రధానోపాధ్యాయుడు వివరించారు.

పాలిహౌజ్‌లతో అధిక దిగుబడులు

గతంలో ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారు: వేముల

నిజామాబాద్,మార్చి10(ఆర్ఎన్ఎ): ఆధునిక యాంత్రిక సాగుపై దృష్టిసారించి అధిక లాభాలు వచ్చే కొత్త పద్ధతులు రూపొందించాల్సి ఉందని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. పాలీహౌస్ సాగులక్ష్యం పెంచాలని నిర్ణయించారు. రాష్ట్రాన్ని విత్తన కేంద్రంగా మార్చాలన్న లక్ష్యంతో సీఎం అనేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వాలు ప్రాజెక్టులు నిర్మించక పోవడంతోనే రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఆ పాపం వారిదేనన్నారు. దేశంలో తొలిసారిగా పాలీహౌస్ సాగును హర్యానాలో ప్రారంభించారని, ఏడాదికి 150 ఎకరాల్లో సాగు చేస్తే.. తెలంగాణలో రెండేండ్లలో వేయిఎకరాల్లో సాగైందని మంత్రి తెలిపారు. మెదక్,నిజామాబాద్ అధిక లాభాలను ఆర్జించేలా వారిని ప్రోత్సహించాల్సిన అవసరముందని అన్నారు. రాష్ట్రాన్ని విత్తన కేంద్రంగా మార్చాలన్న లక్ష్యంతో సీఎం అనేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వాలు ప్రాజెక్టులు నిర్మించక పోవడంతోనే రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఆ పాపం వారిదేనన్నారు. దేశంలో తొలిసారిగా పాలీహౌస్ సాగును హర్యానాలో ప్రారంభించారని, ఏడాదికి 150 ఎకరాల్లో సాగు చేస్తే.. తెలంగాణలో రెండేండ్లలో వేయిఎకరాల్లో సాగైందని మంత్రి తెలిపారు. మెదక్,నిజామాబాద్ జిల్లాల్లో పాలీహౌస్ సాగుచేస్తూ బాగా సంపాదిస్తున్నారని చెప్పారు. దీంతో కూరగాయలు, పళ్లు పండించవచ్చిన అంటున్నారు. ఇకపోతే నానాటికీ అంతరించి పోతున్న ఆవులను సంరక్షించుకొంటే ఎన్నో లాభాలు ఉన్నాయని, ఒక్క ఆవు పేడ, మూత్రంతో దాదాపు 25 నుంచి 30 ఎకరాలను సాగుచేయవచ్చునని, దీంతో సాగుచేసిన పంటలు ఎంతో ఆరోగ్యాన్నిస్తాయని తెలిపారు. అంతర పంటల ద్వారా వచ్చే లాభంతో ప్రధాన పంట ఖర్చులు తీరిపోతాయి. ప్రధాన పంట నుంచి వచ్చే సంపాదన అదనపు సంపాదన అవుతుంది. ఏక పంటలు సాగుచేయకుండా మిశ్రమ పంటలను సాగుచేస్తే కనీసం 20 రకాల పంటలు వేసుకొవచ్చు. ఆ పద్ధతిలో మామిడి, కొబ్బరి, చింత, శీతాఫలం, దానిమ్మ, ఆముదంతో పాటు పసుపు, చెరకు, మొక్కజొన్న, వరి పంటలను పండించవచ్చని తెలిపారు.. విత్తన ఉత్పత్తి విషయంలో తెలంగాణ జిల్లాలు అగ్రస్థానంలో నిలబడి ఎక్కువ మంది రైతులు విత్తన ఉత్పత్తిలో పాల్గొనేలా కార్యాచరణచేస్తున్నారు. కంపెనీలు పక్క రాష్ట్రాలకు తరలిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం విత్తన ఉత్పత్తికి రైతులతో ఒప్పందాలకు కంపెనీల ప్రతినిధులు సుముఖత వ్యక్తం చేశారు.

అరటి రైతుల కష్టాల సాగు

పెట్టుబడులు కూడా రావడం లేదని ఆవేదన

ఖమ్మం,మార్చి10(ఆర్ఎన్ఎ): అందరికీ తీపిని పంచే అరటటి రైతుకు చేదే మిగులుతుంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు సరైన ధరలు లేకపోవడం, పెట్టుబడులు గణనీయంగా పెరగడంతో అరటిరైతు ఒక్కసారిగా కుదేలడయ్యాడు.

అరటి కాయల వినియోగం తగ్గడం, వాతావరణంలో మార్పులు కూడా ధరలు తగ్గడానికి కారణంగా తెలుస్తుంది. ఉద్యాన పంటలు అనగానే గుర్తుకు వచ్చేది అశ్వారావుపేట, దమ్మపేట ప్రాంతం. ఈ ప్రాంతంలో పండని పంట అంటూ ఉండదు. ఉద్యాన పంటల్లో ఆయిల్‌పాం, మామిడి తరువాత ప్రాధాన్యత కలిగిన పంట అరటి. ఒకప్పుడు అరటి అంటే జిల్లా ప్రజలందరికీ ముందుగా గుర్తుకొచ్చేది ఈ ప్రాంతం. కానీ, కాలానుగుణంగా ఈ పంటకు ఆదరణ లేకపోవడంతో రానురాను సాగు తగ్గుతోంది. దీంతో పెట్టిన ఖర్చులు కూడా రావని అరటి రైతులు ఆందోళన చెందుతున్

కరెంటు కోతలతో అన్నదాతల ఆందోళన

అనంతపురం,మార్చి10(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం వ్యవసాయానికి 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ప్రకటనలు గుప్పిస్తోంది. అయితే జిల్లాలో 9గంటల విద్యు త్ సరఫరా కొన్ని ప్రాంతాల్లో మాత్రమే అమలు చేస్తున్నారు. వేళాపాళాలేని విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎప్పుడు కరెంటు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రోజువారి విద్యుత్ వినియోగం 7 మిలియన్ యూనిట్లకు పైగా ఉన్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. హంద్రీనీవా ద్వారా జిల్లాలో కృష్ణా జలాలు పారడంతో చెరువులు, వంకల్లో నీరు చేరాయి. దీంతో జిల్లాలోని చాలా ప్రాంతాల్లోని బోర్లు రీచార్జ్ అయ్యి పంటల సాగుకు సరిపడా నీరు వస్తున్నాయి. అయితే నీటిని వినియోగానికి విద్యుత్ కోతలు సమస్యగా మారుతున్నాయి. కళ్యాణదుర్గం, హిందూపురం, గుత్తి, ధర్మవరం, కదిరి, తాడిపత్రి, రాప్తాడు, కూడేరు, అనంతపురంరూరల్, ముదిగుబ్బ, బుక్కపట్నం, కనగానపల్లి తదితర మండలాలోని చాలా ప్రాంతాల్లో వ్యవసాయానికి 7గంటలే సరఫరా చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పగటి వేళ్లల్లో 5 గంటలు, రాత్రివేళ్లతో 4గంటలు సరఫరా అవుతోంది. మరికొన్ని ప్రాంతాల్లో పగటి వేళల్లో 4గంటలు, రాత్రివేళ్లలో 3గంటల చొప్పున సరఫరా చేస్తున్నారు. అందులోను అధికారులు కోతలు పెడుతున్నారు. రోజుకు ఒక్కో ప్రాంతంలో ఓవర్‌లోడు, లోఓల్టేజ్, మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల మర్మతులు ఇలా వివిధ కారణాలతో అర గంట నుంచి గంట వరకు కోత పెడుతున్నారు. దీంతో మోటర్లు నడవక నీరదండం లేదన్నారు.

పాఠశాలలకు నిర్వహణ నిధుల విడుదలలో జాప్యం

నెల్లూరు,మార్చి10(ఆర్ఎన్ఎ): పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం ఇస్తున్న అరకొర నిధులు సకాలంలో ఇవ్వడం లేదు. గతనెలలో నిధులు విడుదల చేసినా, వాటి మంజూరుకు ప్రధానోపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. గతంలో ఎస్ఎంసీ ఖాతాల్లో జమ చేసేవారు. తీర్మానం చేసి హెచ్ఎంలు డ్రా చేసేవారు. ప్రస్తుతం పీడీ ఖాతాలో నగదు ఉండడం, బిల్లులను హెచ్ఎంలో ఆన్‌లైన్ లో సమర్పించి సీఎఫ్ఎంఎస్ ద్వారా డ్రా చేసుకోవాలని అధికారులు చెప్పారు. దీంతో వారు తల పట్టుకుంటున్నారు. కాగా ఈ సంవత్సరం ఇంతవరకు పైసా కూడా విడుదల కాలేదు. పాఠశాలల పరిశుభ్రత, విద్యుత్ బిల్లులు, మరుగుదొడ్ల నిర్వహణ, స్టేషనరీ, చాక్‌పీసులు, డస్టర్లు, వార్తాపత్రికలు, జాతీయ పండుగల నిర్వహణకు ఈ నిధులు వినియోగిస్తారు. నిధులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పలు పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ లేక నిరుపయోగంగా ఉన్నాయి. పాఠశాల నిర్వహణకు గతేడాది ఏప్రిల్ నుంచి ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. శుద్ధజలం, చాక్‌పీసులు, ఫినాయిల్, డస్టర్లు, జాతీయ పండుగల నిర్వహణను సొంత నగదుతో చేస్తున్నట్లు టీచర్ యూనియన్ నేతలు తెలిపారు. అయితే గతంలో మాదిరిలా కాకుండా ప్రస్తుతం సీఎఫ్ఎంఎస్ ద్వారా నిధులు డ్రా చేసుకోవాల్సి ఉంది. దీంతో జాప్యం జర్గుతుందని అధికారులు తెలిపారు.

ఉపాధి పనుల్లో భారీ అవినీతి-రికవరీకి ఆదేశాలు

విశాఖపట్నం,మార్చి10(ఆర్ఎన్ఎ): ఉపాధి హామీ పథకం కింద గత ఆర్థిక సంవత్సరంలో కొయ్యూరు మండలంలో జరిగిన పలు పనుల్లో రూ.3.08 కోట్ల అవినీతి జరిగినట్టు సామాజిక బృందం తనిఖీల్లో వెలుగు చూసింది. అత్యధికంగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో నిధుల దుర్వినియోగం అవినీతి జరిగినట్టు నిర్దారణ అయ్యింది. స్వాహా చేసిన నిధుల్లో రూ.2.21 కోట్ల మేర సంబంధిత శాఖల సిబ్బంది నుంచి రికవరీ చేయాలని ప్రజావేదికలో నిర్ణయించారు. కొయ్యూరు మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో మార్చి వరకు జాతీయ ఉపాధి హామీ పథకం కింద వివిధ శాఖల ఆధ్వర్యంలో సుమారు రూ.26 కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగాయి. అయితే చాలాచోట్ల పనులు చేపట్టకుండానే బిల్లులు డ్రా చేయడం, పనుల్లో నాణ్యతలేకపోవడం వంటి ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై ఉన్నతాధికారులు స్పందించి, సామాజిక తనిఖీలకు ఆదేశించారు. ఫిబ్రవరి 12వ తేదీ నుంచి ఈ నెల 2వ తేదీ వరకు సామాజిక బృందం అన్ని పంచాయతీల్లో తనిఖీలు నిర్వహించి నివేదిక సమర్పించింది. ఈ నివేదికను ప్రజావేదికలో ప్రవేశపెట్టి, ఏ శాఖ పనుల్లో ఎంతమేర అవినీతి జరిగిందో అధికారులు వివరించారు. వీటిని సంబంధిత ఉద్యోగుల నుంచి రికవరీ చేయాలని నిర్ణయించారు.

లక్ష్యానికి దూరంగా సాక్షరతా కేంద్రాలు

అనంతపురం,మార్చి10(ఆర్ఎన్ఎ): సాక్షరభారతి కేంద్రాల నిర్వహణ పేరుతో నిధులు దుర్వినియోగం అవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాక్షరభారతి కేంద్రాల పనితీరు కన్పించడం లేదు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదన్న విమర్శుల ఉన్నాయి. ఇక్కడ పనిచేసే కో ఆర్డినేటర్లకు ప్రతినెలా వేలాదిరూపాయల గౌరవవేతనం చెల్లిస్తున్నారు. అంతేకాకుండా ప్రతిగ్రామంలోనూ సాక్షర భారత్ కేంద్రానికి డిజిటల్ క్లాక్, మ్యాప్స్, నోట్‌బుక్స్, సోలార్ ల్యాంప్స్, కుట్టుమిషన్లు వంటి పరికరాలను పంపిణీ చేశారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి వాస్తవానికి దూరంగా ఉంది. కోఆర్డినేటర్లు కేంద్రాలను సరిగా నిర్వహించడం లేదు. వారు తమ గౌరవవేతనంలో కొంత మొత్తాన్ని అధికారులకు చెల్లిస్తుండటంతో అధికారులు కూడా కేంద్రాలవైపు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలు వినపడుతున్నాయి. పంపిణీ చేసిన పరికరాలు గ్రామపంచాయతీ కార్యాలయాలలో వృధాగా పడిఉన్నాయి. కేంద్రాల నిర్వహణ తీరుపై అధికారులను ప్రశ్నించగా జిల్లా స్థాయిలోనే వాటి నిర్వహణ అంతంత మాత్రమేనని తాము మాత్రం ఏమి చేస్తామని వ్యాఖ్యానిస్తున్నట్లు సమాచారం. గ్రామ కోఆర్డినేటర్లను హెచ్చరిస్తే రాజకీయ నాయకుల నుండి ఒత్తిళ్లను ఎదుర్కొవాల్సి వస్తోందని అధికారులు వాపోతున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాలలో అక్షరాస్యతశాతాన్ని పెంచడానికి సాక్షరభారతి కేంద్రాలను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చురుకుగా మిషన్ భగీరథ పనులు

మెదక్,మార్చి10(నేటినిజం ప్రతినిది): ఉమ్మడిమెదక్ జిల్లాలో మిషన్ భగీరథ పనులు చురకుగా సాగుతున్నాయి. ఈ మేరకు పైపు లైన్ పనులు పూర్తి కావస్తున్నాయి. ఒక్క మెదక్ నియోజకవర్గంలో రూ.800 కోట్ల నిధులతో మిషన్ భగీరథ పనులు కొనసాగుతున్నాయి. డిసెంబర్ నెలాఖరు లోగా మిషన్ భగీరథ పనులు పూర్తి చేస్తామన్న ధీమాలో అధికారులు ఉన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా హల్దీ, సింగురు ప్రాజెక్టులు నీటిని అందించి లక్ష ఎకరాలకు సాగు నీటిని అందించేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారు. ఆడ పిల్లలను ఆదుకునేందుకే సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టి వారి పెండ్లికు రూ.51 వేలు అందిస్తున్నారని తెలిపారు. పీఎఫ్ కలిగి ఉన్న ప్రతి బీడీ కార్మికురాలికి ఏప్రిల్ నుంచి నెలకు రూ.వెయ్యి జీవన భృతిని అందించడం జరుగుతుందని అన్నారు. ఒంటరి మహిళలకు సైతం నెలకు వెయ్యి రూపాయల జీవన భృతిని అందిస్తామన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ రూ.34 వేల కోట్ల నిధులతో పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజలను ఆదుకుంటున్నారని తెలిపారు.

నీళ్లు,నియామకాల హామీలు ఏమయ్యాయి?

నిజామాబాద్,మార్చి10(ఆర్ఎన్ఎ): నీళ్లు, నియామకాల కోసం సాధించిన తెలంగాణ రాష్ట్రంలో రైతులకు నీళ్లు లేవు, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను విస్మరించడమే గాకుండా కాలక్షేపపు కబుర్లతో ప్రజలను మోసపుచ్చుతున్నారని అన్నారు. లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి వాటిని విస్మరించారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులు ఉద్యోగ ప్రకటనల కోసం నిరీక్షిస్తున్నా సర్కారు స్పందించకపోవడం శోచనీయమన్నారు. బకాయి ఫీజులను వెంటనే చెల్లించాలన్నారు. ఒప్పంద ఉద్యోగులకు పనికి తగిన వేతనాలు ఇవ్వాలని డిమాండు చేశారు. రైతులకు రుణమాఫీ, రెండు పడకల గదుల ఇళ్ల నిర్మాణం ఏవీ ఆచారణలో అమలు కావడం లేదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిఒక్కరికి ప్రశ్నించే హక్కు ఉంటుందని పేర్కొన్నారు. తెరాస నాయకులకు ఏం చేయాలో తోచక అనవసరంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. తెరాస ప్రభుత్వం, నాయకులు ప్రజ సమస్యలపై మాట్లాడే వారిని విమర్శించడం అలవాటుగా చేసుకున్నారని ఎద్దేవా చేశారు.

మద్దతు ధరలు దక్కని రైతులు

ఖమ్మం,మార్చి10(ఆర్ఎన్ఎ): కందిరైతులకు ఎక్కడా గిట్టుబాటు ధరలు చెల్లించి కొనుగోలు చేయలేదని తేలింది. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరలు చెల్లించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మద్దతు ధరలు గిట్టుబాటు కాకుండా పోయినా అమ్ముకుందామనుకున్న వారికి తక్కువ ధరలు మళ్లీ వెక్కిరించాయి. ఖమ్మం జిల్లాలో వివిధ వ్యవసాయ మార్కెట్లలో కందుల కొనుగోళ్లపై ఆరా తీశారు. కొన్ని జిల్లాల్లో ప్రభుత్వ కేంద్రాల్లో వ్యాపారుల సరుకును పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు రావడంతో జిల్లాల్లో తనిఖీలు చేపట్టారు. పలువురు రైతులతో మాట్లాడారు. మద్దతు ధర దక్కక పోవటం గురించి రైతులు ఏకరువు పెట్టారు. ఎఫ్‌సీఐ, మార్క్‌ఫెడ్‌లు కందులు కొనుగోలు చేయకపోవటం వల్ల వ్యాపారులు మరింత ధర తగ్గిస్తున్నారని వాపోయారు. ఖమ్మంలో నాఫెడ్ ద్వారా కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు ఈ సందర్భంగా కోరారు.

ప్రణయ్ హత్య కేసు విచారణ 23కు వాయిదా

ఛార్జీషీటు దాఖలు చేసిన నల్లగొండ పోలీసులు
మారుతీరావు ఆత్మహత్య చేసుకున్నట్లు వివరణ
మారుతీరావు ఆస్తులు 200 కోట్లు ఉన్నట్లు సమాచారం

నల్లగొండ,మార్చి10(ఆర్ఎన్ఎ): ప్రణయ్ హత్య కేసు విచారణ ఈ నెల 23కి వాయిదా పడింది. నల్లగొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో ప్రణయ్ హత్య కేసు విచారణ జరిగింది. నిందితులు అస్గర్ అలీ, సుభాష్ శర్మను పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. మిగతా నిందితులు అబ్దుల్ భారీ, కరీం, శివ, నిజాం సైతం కోర్టుకు హాజరయ్యారు. అయితే ఏ1 నిందితుడు మారుతీరావు సోదరుడు శ్రవణ్ మాత్రం కోర్టుకు హాజరుకాలేదు. ఏ-1 నిందితుడు మారుతీరావు ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు కోర్టుకు తెలిపారు.

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మిర్యాలగూడ పెరుమాళ్ల ప్రణయ్ హత్య కేసులో నల్గొండ ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం విచారణ చేపట్టింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న సుభాష్ శర్మ, అస్గర్ అలీ, అహ్మద్ భారీ, కరీం, శివ, నిజాం కోర్టుకు హాజరయ్యారు. ఈ క్రమంలో ప్రణయ్ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా(ఏ-1)గా ఉన్న తిరునగరు మారుతీరావు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు కోర్టుకు తెలపడంతో.. తదుపరి విచారణను ఈనెల 23కి వాయిదా వేస్తున్నట్లు న్యాయస్థానం తెలిపింది. కాగా తన కుమార్తె అమృతను ప్రేమించి, కులాంతర వివాహం చేసుకున్నాడని 2018 సెప్టెంబర్ 14వ తేదీన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో పెరుమాళ్ల ప్రణయ్ అనే యువకుడిని మారుతిరావు కిరాయి రౌడీలతో హత్య చేయించినట్లు కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో 7 నెలలపాటు జైలులో ఉండి బెయిల్‌పై బయటకు వచ్చిన ఆయన.. శనివారం రాత్రి ఖైరతాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ కేసులో మారుతీరావు సహా 8 మంది నిందితుల పేర్లను పోలీసులు చార్జ్‌షీట్‌లో చేర్చారు. ఏ-1 గా మారుతీంరావు, ఏ-6గా ఆయన తమ్ముడును శ్రవణ్ ను పేరును చేర్చి.. 102 మంది సాక్షులను విచారించి... అమృత- ప్రణయ్‌ల ప్రేమ మొదలు.. ప్రణయ్ హత్య వరకు ప్రతీ అంశాన్ని1200 పేజీలతో కూడిన చార్జ్‌షీట్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. ప్రణయ్ హత్య సమయంలో అతడి భార్య అమృత ఆరు పేజీల స్టేట్‌మెంట్ ఇచ్చింది. ఆమెతో పాటు ప్రధాన నిందితుడు మారుతీరావు, శ్రవణ్, ప్రణయ్ తండ్రి బాలస్వామి తదితరుల ఇచ్చిన స్టేట్‌మెంట్ వివరాలు ఉన్నాయి. ఇదిలావుంటే మారుతీరావు ఆస్తుల చిట్టా బయటికొస్తోంది. మార్కెట్ విలువ ప్రకారం ఆయన ఆస్తులు రూ.200 కోట్లు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. మొదట మారుతీరావు కిరోసిన్ డీలర్ వ్యాపారం చేశాడు. తర్వాత రైస్ మిల్లుల బిజినెస్.. అనంతరం వాటిని అమ్మి రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి దిగారు. శరణ్య గ్రీన్ హోమ్స్ పేరుతో వంద విల్లాలు విక్రయించారు. హైదరాబాద్‌లో పలు చోట్ల ఐదు ప్లాట్స్.. మిర్యాలగూడలో ఓ షాపింగ్ మాల్, ఈదులగూడెంలో మరో షాపింగ్ మాల్ ఉన్నాయి. మారుతీరావు పేరు మీద రెండంతస్తుల షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. మిర్యాలగూడ బైపాస్‌లో 22 కుంటల భూమి ఉంది. మిర్యాలగూడలో సర్వే నెం.756లో ఎకరం 2 కుంటల భూమి.. మిర్యాలగూడలో సర్వే నెం.457లో 7 కుంటల భూమి.. దామరచర్లలో 20 ఎకరాల పట్టా భూమి.. బంధమ్, తాళ్లగడ్డ, ఈదులగూడెం, షబానగర్, బంగారు గడ్డలో ఎ÷-లాట్స్.. మారుతీరావు పేరు మీద 6 ఎకరాల 19 కుంటల భూమి, ఒక స్కూల్ ఉన్నాయి.

వైకాపాలోకి భారీగా చేరికలు

వివిధ జిల్లాల్లో టిడిపిని వీడిన నేతలు
వైకాపాలో చేరిన మాజీమంత్రి బాలరాజు

అమరావతి,మార్చి10(ఆర్ఎన్ఎ): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వైకాపాలోకి వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా భారీసంఖ్యలో చేరుతున్నారు. స్థానిక ఎన్నికల ముందు ఈ చేరికలు పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతున్నాయి. తాజాగా విశాఖపట్నం, గుంటూరు, పశ్చిమగోదావరి, కర్నూలు జిల్లాల్లో మంగళవారం అధిక సంఖ్యలో వివిధ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కృషి చేస్తామని వారు తెలిపారు. రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, మంత్రి అవంతి శ్రీనివాసరావు సమక్షంలో మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, ఆయన కుమార్తె డాక్టర్ దర్శిని, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్ కుమార్, టీడీపీ నాయకులు గుడ్ల సత్యారెడ్డి, విజయసాయి, వ్యాపారవేత్త చిక్కాల రవి నాయుడు, పి.ఉషశ్రీ, జనసేన సీనియర్ నాయకులు పివి సురేష్, కొణతాల సుధ తదితరులు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వారికి విజయసాయిరెడ్డి, అవంతి శ్రీనివాసరావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

కర్నూలు జిల్లా ఉయ్యాలవాడ మండల కేంద్రంలో టీడీపీ షాక్ తగిలింది. ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అధర్వంలో 100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. వారికి గంగుల ప్రభాకర్ రెడ్డి, బిజేంద్రారెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కోవెలకుంట్ల మండలం బిజినవేముల మాజీ సర్పంచ్ గడ్డం భక్త ప్రహ్లాదరెడ్డి, గడ్డం శంకర్‌రెడ్డిలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వారికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భీంరెడ్డి ప్రతాప్, సుధాకర్‌రెడ్డి, హుస్సేనయ్య పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు మండలంలో నాలుగు కొల్లేరు గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు సమక్షంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 500 మంది కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఉంగరాల రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నివాసంలో పార్టీలో చేరారు. వారికి ప్రసాదరాజు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. గుంటూరు టీడీపీ నేత, మాజీ మున్సిపల్ చైర్మన్ భవనాసి యల్లారావు సహా మాజీ కౌన్సిలర్లు, అనుచరులు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వారికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కారణంగా పార్టీలోకి చేరుతున్నామని వారు తెలిపారు.

టిడిపిని వీడనున్న కనిగిరి మాజీ ఎమ్మెల్యే బాబూరావు

ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు టీడీపీ వీడనున్నారని అక్కడి స్థానిక కార్యకర్తలు తెలిపుతున్నారు. 2014లో కనిగిరి ఎమ్మెల్యేగా గెలిచారు. 2019లో దర్శి నియోజకర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. దీంతో టిడిపి పట్ల అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన టిడిపిని వీడనున్నారు. హీరో బాలకృష్ణ కి, బాబురావు స్నేహితులు. ఆయన ద్వారానే టిడిపిలోకి చేరారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో మధ్యాహ్నం వైసీపీలోకి చేరే అవకాశాలు కూడా ఉండవచ్చునని సమాచారం.

పులివెందులలో టిడిపికి షాక్

వైకాపాలో చేరుతున్నట్లు సీతీష్ రెడ్డి వెల్లడి

కడప,మార్చి10(ఆర్ఎన్ఎ): కడప జిల్లా పులివెందులలో టిడిపికి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. టిడిపిని వీడుతున్నట్లు మాజీ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ సతీష్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం వేంప్లలెలో ఏర్పాటు చేసిన టిడిపి కార్యకర్తల సమావేశంలో సతీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... టిడిపి వీడుతున్నట్లు తెలిపారు. దశాబ్దాలుగా వైఎన్ కుటుంబంతో తలపడుతున్న తెలుగుదేశం పార్టీ నుంచి తనకు సరైన ఆదరణ లభించలేదని ఆరోపించారు. మనసును చంపుకొని తెలుగుదేశం పార్టీలో ఉండేది లేదని స్పష్టత చేశారు. మనస్ఫూర్తిగా చెబుతున్నా.. తెలుగుదేశం పార్టీలో నా శాయశక్తులా పనిచేశా.. అయినా సరైన ఆదరణ లేకపోవడంతో తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేస్తున్నా అని చెప్పారు. ఈ నెల 13 వ తేదీన వైసిపిలో తాను చేరనున్నట్లు నతీష్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ సమావేశంలో సతీష్ కుమార్ రెడ్డి, సింహాద్రిపురం, తోండూరు మాజీ జడ్పీటీసీ ప్రోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, శివమోహన్ రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ లుబాలస్వామి రెడ్డి, మునిరెడ్డి లతో పాటు ఆయా మండలాల్లోని కన్వీనర్ లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గన్నారు.

మంజీరా తీరప్రాంత రైతులను ఆదుకోవాలి

మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి

మెదక్,మార్చి10((నేటినిజం ప్రతినిది): జిల్లాలో రోజురోజుకూ భూగర్భజలాలు తగ్గుముఖం పట్టడం, మంజీర నదిలో నీరంతా ఇంకిపోవడంతో సమస్య మొదలైంది. వరి పంటకు పేరెన్నికగన్న హవేలిఘణపూర్ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఇప్పుడు వరితడులకు నీరందక ఆందోళన చెందుతున్నారు. వెంటనే మంజీరానీరు వదిలి రైతులను ఆదుకోవాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి కోరారు. రైతులకు పంటనష్టపోకుండా చూడాలన్నారు. వీరంతా మంజీరా నీటి కోసం ఎదురుచూస్తున్నారు. శివారును ఆనుకొని మంజీరా నది ప్రవహించడం వల్ల ఈసారి యాసంగికి నది పాయల్లో నీరు ఉండటంతో అన్నదాతలు వరి నాట్లు వేయాలని సంకల్పించారు. మంజీరా నదిలో నీరు వదిలే అవకాశం ఉండటంతో పంటలు ఎలాగైనా గట్టెక్కుతాయని ఆశించారు. అందుకే మంజీరానది నీటిపై వరినాట్లు వేశారు. ఇటీవల నదిలోకి కొంత నీరు వదిలినా శివారు వరకు చేరుకున్నా ఫలితం లేకుండా పోయింది. వెంటనే ఇంకిపోతుండటంతో పొలాలు ఎండిపోతున్నాయి. ఇప్పటికే వంద ఎకరాల వరకు పంట ఎండిపోయిందని, ఇకనైనా నదిలో నీరు వదలకపోతే మరో 200కు పైగా ఎకరాల్లో పంట నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడులన్నీ కళ్ల ముందు ముళ్లలా కనిపిస్తుండగా పంటెండిపోతే అప్పులు మీదపడతాయని ఆందోళనలో ఉన్నారు. పంటను ఎలాగైనా కాపాడుకోవాలనే ప్రయత్నంలో రైతులు పొలాలకు నీటి మడుల నుంచి మోటార్ల ద్వారా నీరు సరఫరా చేసేందుకు వేసిన పైపులు నదిలో అడుగడుగునా కనిపిస్తున్నాయి. అయితే మడుగుల్లో సైతం నీరంతా ఇంకిపోయి గత రెండు వారాల నుంచి పొలాలు బీటలు వారుతున్నాయి. ఇప్పటికే పలుచోట్ల బీటలు వారి పరి పంట మొత్తం వాడిపోతోంది.

కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సింధియా

ఏడాది కాలంగా పార్టీని వీడాలనుకుంటున్నట్లు వెల్లడి
ముందు సస్పెండ్ చేసిన కాంగ్రెస్ పార్టీ

న్యూఢిల్లీ,మార్చి10(ఆర్ఎన్ఎ): ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన తర్వాత జ్యోతిరాదిత్య సింధియా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. 18ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన సింధియా మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్ వైఖరితో బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా తన రాజీనామా లేఖను కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీకి పంపారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్న సింధియా కీలక అంశాలను లేఖలో పేర్కొన్నారు. 'కాంగ్రెస్‌లో ఉండి దేశానికి ఏమీ చేయలేకపోతున్నా.. అందుకే కాంగ్రెస్‌కు రాజీనామా చేశాను. కాంగ్రెస్‌లో సముచిత స్థానం లభించలేదు. ఏడాది కాలంగా పార్టీని వీడాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో తనకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు. భవిష్యత్‌ను నిర్ణయించుకోవాల్సిన సమయం వచ్చిందని సింధియా పేర్కొన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఏ మాత్రం ఉపేక్షించకూడదని కాంగ్రెస్ అధిష్టానం హెచ్చరించింది. జ్యోతిరాదిత్యను పార్టీ నుంచి బహిష్కరించినట్లు కాంగ్రెస్ ప్రకటించింది. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నందునే బహిష్కరిస్తున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు.

యాదాద్రిలో యధావిధిగా నిత్యోత్సవాలు

యాదాద్రి,మార్చి10(ఆర్ఎన్ఎ): యాదాద్రి పుణ్యక్షేత్రంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో నిత్యకల్యాణోత్సవాల నిర్వహణ మొదలయ్యింది. వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గత 11రోజులుగా నిలిపివేసిన నిత్యకల్యాణ నిర్వహణకు పూజారులు ఆచారపరమైన సన్నాహాలు చేపట్టారు. ఇకపోతే యాదాద్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగిన డోలోత్సవంతో ముగిసాయి. డోలోత్సవ పర్వంతో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయని ఆలయ పూజారులు, నిర్వహకులు వెల్లడించారు. వార్షికోత్సవాల సందర్భంగా 11 రోజులపాటు ఉత్సవ పూజలు కొనసాగాయి. పాంచరాత్ర ఆగమశాస్త్రరీత్యా జరిగిన అభిషేక పర్వంలో ఆలయ నిర్వాహకులు ఉద్యోగులు పాల్గొన్నారు. శాస్త్రోక్త పర్వాల మధ్య కొనసాగిన అభిషేకం, డోలోత్సవాలలో ఆలయ నిర్వాహకులు, ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు. యాజ్ఞికులు, పూజారుల బృందాలు ఉత్సవ ముగింపు పర్వాలను పాంచరాత్ర ఆగమశాస్త్రరీత్యా నిర్వహించారు.

వైకాపా ప్రభుత్వానికి హైకోర్టు షాక్

ప్రభుత్వ భవనాలకు వైకాపా రంగులా
10 రోజుల్లో పార్టీ రంగులను తొలగించండి
ఎపి హైకోర్టు ఆదేశాలు

అమరావతి,మార్చి10(ఆర్ఎన్ఎ): ఎపిలో వైకాపా సర్కార్‌కు షాక్ తగిలింది. వైసీపీకి హైకోర్టు ఝలక్ ఇచ్చింది. ప్రభుత్వ కార్యాలయాలకు వైసిపి రంగులు వేయడంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. పంచాయతీ భవనాలకు రాజకీయ పార్టీల రంగులను తొలగించాలని ఆదేశించింది.

ప్రభుత్వ కార్యాలయాలకు వైసీపీ రంగులను వేయడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ రంగులపై హైకోర్టు మంగళవారం తీర్పును వెలువరించింది. పంచాయతీ భవనాలకు వైసీపీ రంగులను 10 రోజుల్లో తొలగించాలని ఆదేశాలు జారీ

'భోజనామృతం'.. ప్రారంభించిన మంత్రి హరీష్‌రావు

సిద్దిపేట, మార్చి 10: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీష్‌రావు సిద్దిపేటలోని రైతుబజారులో హరేరామ హరే కృష్ణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'భోజనామృతం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 5 రూపాయలకే భోజనం అందించనున్నారు. 'భోజనామృతం'లో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించారు. స్టీల్ ప్లేట్లు, గ్లాసులు మాత్రమే వాడనున్నారు. మంత్రి.. రైతులకు స్వయంగా భోజనం వడ్డించారు.

అంతకు ముందు మంత్రి హరీష్ రావు.. రైతులతో మాట్లాడారు. పంటలకు గిట్టుబాటు ధర వస్తుందా.. అని మహిళా రైతులను ఆప్యాయంగా పలకరించారు. వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఏ పంటలు ఏ సమయంలో పండించాలో తెలుసుకోవాలన్నారు. వేసవి సమయంలో కూరగాయలకు అధిక ధర ఉంటుంది గనుక ప్రణాళికా ప్రకారం పంటలు వేసుకోవాలని రైతులకు సూచించారు. అప్పుడే రైతు.. రాజు అవుతాడని మంత్రి తెలిపారు. టమాట పంట శీతాకాలంలో పండుతుంది గనుక ఎక్కువ డిమాండ్ ఉంటుందనీ.. అందుకనుగుణంగా వేసవిలోనూ టమాట పంటను పండించాలన్నారు. అందుకు షెడ్డును వేసుకోవాలని మంత్రి సూచించారు. షెడ్డుకు అవసరమైన సహాయం ప్రభుత్వం అందిస్తుందని మంత్రి.. రైతులకు భరోసా ఇచ్చారు. రైతు బజారును పరిశుభ్రంగా ఉంచాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు చెత్త బుట్టలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రి హరీష్‌రావుతో పాటు ఏఎంసీ చైర్మన్ పాల సాయిరాం, ఎఫ్‌టీసీసీఐ ప్రతినిధులు కరుణేంద్ర, కేతి నర్వర్, భాస్కర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఎస్ బ్యాంక్ ఖాతాదారులకు శుభవార్త

విత్ డ్రాయల్ ఆంక్షలు త్వరలోనే ఎత్తివేత

ముంబయి,మార్చి10(ఆర్ఎన్ఎ): యస్ బ్యాంకు సంక్షోభంతో ఆందోళనలో పడిన బ్యాంకు ఖాతాదారులకు స్వల్ప ఊరట కలగనుంది. నగదు ఉపసంహరణకు సంబంధించి ఇటీవల ఆర్‌బీఐ విధించిన ఆంక్షలను త్వరలోనే ఎత్తివేయనుందని సమాచారం. యస్‌బ్యాంకు ఖాతాదారులు ఈ వారాంతానికే ఎలాంటి పరిమితి లేకుండా తమ నగదును విత్‌డ్రా చేసుకునే వెసులు బాటు కలగనుంది. ఈ విత్‌డ్రాయల్‌ను మార్చి 15 వరకే పరిమితం చేసి తర్వాత ఎత్తివేసే అవకాశం ఉందని కొత్తగా నియమితులైన యస్‌బ్యాంక్ అడ్మినిస్ట్రేటర్ ఎస్‌బీఐ మాజీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్ కుమార్ సోమవారం ప్రకటించారు. మొదట రూ.50వేల విత్‌డ్రా చేసుకునే అవకాశం నెలరోజులు కాలపరిమితిగా ప్రకటించినప్పటికీ, ప్రస్తుతం దానిని మార్చి 15వరకే పరిమితం చేయనున్నారు. ఆ తర్వాత ఖాతాదారులు తమ అకౌంట్లలోని నగదును ఎంతకావాలంటే అంత మొత్తం నగదును విత్‌డ్రా చేసుకోవచ్చు. యస్‌బ్యాంక్ కార్యకలాపాలను ఏప్రిల్ 3నాటికి పునరుద్ధరించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇంకా యస్‌బ్యాంక్‌ను ఎస్‌బీఐలో విలీనం చేస్తారనే ఊహాగానాల్లో వాస్తవం లేదని, యస్ బ్యాంక్ స్వతంత్రంగానే పనిచేస్తుందని పునరుద్ఘాటించారు. మూలధనం సమకూర్చలేనప్పుడు మాత్రమే విలీనం అవసరమేర్పడుతుందని అన్నారు. ప్రస్తుతం ఇతర బ్యాంకులతో చర్చిస్తున్నామని వివరాలన్నింటిని మార్చి 14న వెల్లడిస్తామని తెలిపారు. అటు యస్ బ్యాంకు లో 49 శాతంవాటాల కొనుగోలు ప్రభుత్వ రంగ దిగ్గజ బ్యాంకు ఎస్‌బీఐ ఆమోదం తెలిపింది. తొలి దశలో భాగంగా ఎస్‌బీఐ రూ. 2450 కోట్లను యస్ బ్యాంకులో ఇన్వెస్ట్ చేయనుంది. ఈ వార్తల నేపథ్యంలో సోమవారం భారీ పతనంలో కూడా యస్ బ్యాంకు షేర్ల కొనుగోళ్లకు పెట్టుబడి దారులు ఆసక్తి చూపారు. దీంతో 32 శాతం ఎగిసిన యస్ బ్యాంకు షేరు 21.35 వద్ద ముగిసింది. కాగా యస్‌బ్యాంక్‌లో అక్రమాలు నేపథ్యంలో ఆర్‌బీఐ ఆంక్షలను విధించిన సంగతి తెలిసిందే. బ్యాంకు లావాదేవీలపై నెల రోజుల పాటుమారటోరియం విధించింది. కేవలం రూ.50వేలు మాత్రమే విత్‌డ్రా చేసుకునేలా ఆంక్షలు విధించింది. మరోవైపు యస్‌బ్యాంక్ పునరుద్ధరణకు ఆర్‌బీఐ సత్వర చర్యలు పక్రియను వేగవంతం చేసింది.

ఉరినుంచి తప్పించుకునే యత్నాల్లో నిర్భయదోషులు

యావజ్జీవ శిక్షగా మార్చాలంటూ వినయ్ శర్మ పిటిషన్

న్యూఢిల్లీ,మార్చి9(ఆర్ఎన్ఎ): నిర్భయ దోషులు చట్టంలోని లొసుగులను అడ్డం పెట్టుకుని ఉరి శిక్ష అమలును ఆలస్యం చేస్తూ వస్తున్నారు. ఇప్పటికే న్యాయపరంగా ఉన్న అవకాశాలను వాడుకునే నెపంతో మూడు సార్లు ఉరిని వాయిదా వేయించగలిగారు. జనవరి, ఫిబ్రవరిలో ఢిల్లీలోని పాటియాలా కోర్టు డెత్ వారెంట్లు ఇచ్చి మళ్లీ వాటిని అదే కోర్టు నిలిపేసింది. మార్చి 3న ఉదయం 6 గంటలకు ఉరి తీయాలని గత నెలలో ఇచ్చిన ఆదేశాలపై కూడా ఆ ముందు రోజునే దోషుల్లో ఒకడైన పవన్ గుప్తా క్షమాభిక్ష పిటిషన్ పెండింగ్‌లో ఉందన్న కారణంతో కోర్టు స్టే ఇచ్చింది. అయితే ఆ తర్వాత పవన్ గుప్తా పిటిషన్‌ను రాష్ట్రపతి తిరస్కరించడంతో మళ్లీ నిర్భయ తల్లి కోర్టును ఆశ్రయించారు. దోషులు నలుగురికీ డెత్ వారెంట్ జారీ చేయాలని ఆమె పిటిషన్ వేయడంతో పాటియాలా కోర్టు సానుకూలంగా స్పందించింది. మార్చి 20న ఉదయం 5.30 గంటలకు ఉరి తీయాలని తీహార్ జైలు అధికారులను ఆదేశిస్తూ తీర్పునిచ్చింది.

నిర్భయ దోషులు నలుగురికీ అన్నీ లీగల్ ఆప్షన్లు ముగియడంతో ఈ సారి ఉరి అమలు ఖాయమని అందరూ భావిస్తున్నారు. వాళ్లకు జీవితకాలం ఉరి అమలు కాకుండా చూస్తానంటూ కొద్ది రోజుల క్రితం కోర్టు హాలులోనే నిర్భయ తల్లితోనే సవాలు చేసిన దోషుల లాయర్ ఏపీ సింగ్ కొత్త దారులు వెతకడం మొదలుపెట్టారు. ఉరి నుంచి శిక్ష తగ్గించడానికి ఉన్న మార్గాలను వెతుకుతున్న ఆయన మరో పిటిషన్‌తో ముందుకొచ్చారు. నలుగురు దోషుల్లో ఒకడైన వినయ్ శర్మ తరపున తాజాగా మరో పిటిషన్‌తో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌ను ఆశ్రయించారు. సెక్షన్ 432, సీఆర్పీసీ 433లను అనుసరించి వినయ్‌కు ఉరి శిక్షను రద్దు చేయాలని కోరారు. అతడి శిక్షను తగ్గించి యావజ్జీవంగా మార్చాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.

గ్రేటర్‌కు ముందస్తు ఎన్నికలు లేవు

స్పష్టం చేసిన నగర మేయర్ బొంతు రామ్మోహన్

హైదరాబాద్,మార్చి10(ఆర్ఎన్ఎ): గ్రేటర్‌మున్సిపల్‌కార్పొరేషన్‌కు గడువు ముగిసిన తర్వాతనే ఎన్నికలు జరుగుతాయని, ముందస్తుకు అవకాశం లేదని మేయర్ బొంతు రామ్మోహన్ స్పష్టంచేశారు. ఇటీవల మున్సిపాలిటీలు,కార్పొరేషన్‌లలో స్వీప్‌చేసిన టీఆర్ఎస్ గ్రేటర్‌ఎన్నికలను ముందస్తుగానే నిర్వహిస్తుందన్న ప్రచారం జరుగుతున్న నేపద్యంలో మేయర్ పై విధంగా స్పందించారు. సోమవారం గ్రేటర్‌కార్యాలయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకరం చేశారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి 10వేల కోట్ల రూపాయలు బ్జడెట్‌లో కేటాయింపు జరిగిన నేపథ్యంలో మేయర్, కార్పొరేటర్‌లు పాలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా మేయర్ బొంతు రామ్మోహన్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం హైదరాబాద్ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. దుర్గం చెరువుపై నిర్మిస్తున్న కేబుల్ బ్రిడ్జి మే నాటికి అందుబాటులోకి వస్తుందన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ మాస్టర్‌ప్లాన్‌ను సిద్దం చేస్తున్నారని, మూసీసుందరీకరణకు బ్జడెట్‌లో పెద్దపీట చేసినట్టు చెప్పారు. ప్రభుత్వం ప్రకటించింది ఎన్నికల బ్జడెట్ కాదని మేయర్ స్పష్టంచేశారు. నగర అభివృద్ధికి ప్రతి ఏటా కేటాయింపులు జరుగుతున్నాయని తెలిపారు.

అంతర్జాతీయ సంక్షోభాన్ని అవకాశంగా తీసుకోవాలి

ఆనంద్ మహీంద్రా సూచన

న్యూఢిల్లీ,మార్చి10(ఆర్ఎన్ఎ): చైనాలో పుట్టుకొచ్చిన కరోనా మహమ్మారి ప్రపంచ దేశాలను వణికిస్తోంది. ఇప్పటికే 100 దేశాలకు ఈ వైరస్ పాకింది. కరోనా భయాలు అటు ప్రపంచ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. చమురు ధరలు భారీగా పతనమవడంతో భారత్ సహా అనేక దేశాల మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. అయితే కరోనా వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులను అవకాశంగా తీసుకుని.. వాటిని భారత్ తనకు అనుకూలంగా మార్చుకోవాలని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా అంటున్నారు. ఇందుకు కొన్ని సూచనలు కూడా చేశారు. చమురు ధరల పతనం, కరోనా ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లో ఉన్న విషయం తెలిసిందే. దీనిపై ఆనంద్ మహీంద్రా ట్విటర్ వేదికగా స్పందిస్తూ.. మార్కెట్ల పరిస్థితిని చూస్తుంటే ప్రపంచ ఆర్థిక మాంద్యంలాగే కన్పిస్తోందని అన్నారు. అయితే ఈ సంక్షోభ పరిస్థితులను వృథా చేసుకోకుండా వాటిని మనకు అనుకూలంగా మార్చుకోవాలని అభిప్రాయపడ్డారు. ఇప్పుడు మన ముందు మూడు అవకాశాలున్నాయి. వినిమయం పెంచడంతో పాటు ద్రవ్యలోటు నుంచి బయటపడేలా లాభాలను పెంచుకునేందుకు ఈ చమురు ధరల పతనాన్ని ప్రభుత్వం ఉపయోగించుకోవాలన్నారు. అలాగే పరిశుభ్రత, స్వచ్ఛ ఉద్యమాన్ని పెంచి పర్యాటకులను ఆకర్షించాలి. అప్పుడు విదేశీయులు చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్‌ను ఎంచుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను పెంచడంతో పాటు విదేశీ పెట్టుబడిదారులకు నిబంధనలు తగ్గించాలి. అప్పుడు వారు చైనాలో కాకుండా భారత్‌లో ఉత్పత్తి కేంద్రాలను తెరిచే అవకాశం ఉంటుందని ఆనంద్ మహీంద్రా ట్విటర్‌లో పేర్కొన్నారు.

సివిసి నియామకంలో పునరాలోచన చేయాలి

-ప్రధాని మోడీకి కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ లేఖ

న్యూఢిల్లీ,మార్చి10(ఆర్ఎన్ఎ): చీఫ్ విజిలెన్స్ కమిషనర్, విజిలెన్స్ కమిషనర్ల నియామకాలపై పునరాలోచించాలని లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి.. ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ప్రధానికి ఓ లేఖ రాశారు. మోదీ సారథ్యంలోని హైపవర్ కమిటీ రాష్ట్రపతి కార్యదర్శి సంజయ్ కొఠారిని కొత్త సీవీసీగా ఎంపిక చేసిన నేపథ్యంలో అధీర్ రంజన్ ఈ లేఖ రాశారు. కొఠారి నియామకంపై చౌదరి ఆందోళన వ్యక్తం చేశారు. కొఠారి సీవీసీ పోస్టుకు అసలు దరఖాస్తు చేసుకోలేదన్నారు. సెర్చ్ కమిటీ సిఫారసు కూడా చేయలేదన్నారు. విధివిధానాల ప్రకారం సీవీసీ, సీవీల పదవి కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తూ పబ్లిక్ అడ్వర్‌టైజ్‌మెంట్లు ఇవ్వాలని, ఆ తర్వాత ప్రధాని సారథ్యంలో సెర్చ్ కమిటీ ఏర్పడాలన్నారు. ఆ తర్వాత ప్రతి దరఖాస్తుదారుకు సంబంధిచి ఐసీనివేదికలు, విజిలెన్స్ నివేదికలు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు.

డబ్బుల కోసం అమృత డ్రామాలాడుతోంది

బాబాయ్ శ్రవణ్ మండిపాటు

మిర్యాలగూడ,మార్చి 10(ఆర్ఎన్ఎ): తనపై అమృత చేసిన ఆరోపణలను మారుతీరావు సోదరుడు శ్రవణ్ ఖండించారు. డబ్బు కోసమే అమృత డ్రామాలు ఆడుతోందని ఆయన ఆరోపించారు. శ్రవణ్ సోమవారం తన నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. అమృత తీరు మమ్మల్ని ఎంతో బాధించింది. నేను మా అన్నయను బెదిరించానని ఆరోపిస్తోంది. నా వల్ల ప్రాణహాని ఉందనిపిస్తే పోలీసులకు ఫిర్యాదు చేసుకోవచ్చు. ఇక ప్రణయ్ హత్యకేసులో నా ప్రమేయం లేదని పోలీసులు తేల్చారు. మా అన్న మారుతీరావు చనిపోయే వరకూ ఉరి తీయాలని అమృత డిమాండ్ చేసింది. ఇప్పుడు అడ్డమైన ఆరోపణలు చేస్తోంది. ప్రణయ్ హత్యకు ముందు మా అన్నకు నాకు మాటలు లేవు. అమృత విషయంలోనే గొడవలు జరిగాయి. ఆమె చేసిన చెత్త పనికే ఇవన్నీ జరిగాయి. తండ్రి చనిపోతే ఆమె వ్యవహరించిన తీరు సరిగా లేదు. తండ్రి మీద ప్రేమ ఉంటే నిన్నటి నుంచి ఎందుకు రాలేదు? నేను బెదిరించే వాడిని అయితే నా పేరు ఎందుకు బయటకు రాలేదు? మా అన్న చనిపోయాక ..అమృతకు ఎందుకు ప్రేమ పుట్టుకు వచ్చింది?

నాన్న అని పిలవడానికి కూడా అమృతకు మాట రావడం లేదు. మీడియాలో కనిపించడం కోసం డ్రామాలు ఆడుతోందని అన్నారు. వాళ్ల అమ్మ దగ్గరకు వస్తే నాకేం అభ్యంతరం లేదు. అన్యాయంగా నన్ను జైలుకు పంపించారు. మళ్లీ ఇప్పుడు నా పై ఆరోపణలు చేస్తోంది. దయచేసి మీడియా కూడా అవాస్తవాలు రాయొద్దు. మాకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవు. ఒకవేళ మా అన్న ఎవరికైనా అప్పు ఉంటే వాటిని తీర్చేందుకు నేను సిద్ధంగా ఉన్నాను' అని తెలిపారు.

హోలీ వేడుకలో ఇరువర్గాల కొట్లాట.. ఒకరి పరిస్థితి విషమం

సూర్యాపేట, మార్చి 10! భిన్న రంగులతో సరదాగా, ఉత్సాహంగా జరగాల్సిన హోలీ సంబురం.. రెండు వర్గాల మధ్య చిచ్చుగా మారింది. ఈ ఘటన సూర్యాపేట పట్టణంలో జరిగింది. వివరాల్లోకెళ్తే.. పట్టణంలో యువత.. వండుగను సందడిగా జరుపుకుంటున్నారు. ఇలాంటి సమయంలో రెండు వర్గాల వ్యక్తులు ఎదురుపడి, వాదులాడుకున్నారు. అది కాస్తా.. పెద్ద రణరంగంగా మారింది. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న పేరాల శేఖర్ అనే వ్యక్తి.. కోట సందీప్‌పై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో సందీప్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, గాయపడిన సందీప్‌ను ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కాగా, దాడిలో గాయపడిన సందీప్ పరిస్థితి విషమంగా ఉన్నదని వైద్యులు తెల్పిపారు.

షష్టిపూర్తి దశలో కాంగ్రెస్ నేత పెళ్లి

రవీనా ఖురానాను పెళ్లి చేసుకున్న ముకుల్ వాస్నిక్

న్యూఢిల్లీ,మార్చి9(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రకు చెందిన మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ముకుల్ వాస్నిక్ 60 ఏళ్ల వయసులో పెళ్లి చేసుకున్నారు. ముకుల్ వాస్నిక్, ఆయన స్నేహితురాలు రవీనా ఖురానాలు ఢిల్లీలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో అతికొద్ది మంది అతిథుల సమక్షంలో ఒక్కటయ్యారు. ఈ కార్యక్రమానికి రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అహ్మద్ పటేల్ మరికొందరు నేతలు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ముకుల్ వాస్నిక్ గతంలో కేంద్రమంత్రిగా పనిచేశారు. ఒకానొక దశలో రాహుల్ గాంధీ రాజీనామా తర్వాత కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ముకుల్ వాస్నిక్ పేరు కూడా ప్రముఖంగా వినిపించింది. కాంగ్రెస్ పార్టీలో ముకుల్ అనేక బాధ్యతలు నిర్వర్తించారు. కాగా.. ముకుల్ వాస్నిక్, రవీనా పెళ్లిపై రాజస్థాన్ సీఎం స్పందిస్తూ.. 'మీకు హృదయ పూర్వక శుభాకాంక్షలు. కొత్త జీవితాన్ని ప్రారంభించబోతున్నందుకు అభినందనలు. రాబోయే రోజులు మీ జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని కోరుకుంటున్నాను' అంటూ ట్వీట్ చేశారు. మరో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి మనీష్ తివారీ స్పందిస్తూ.. 'ముకుల్ వాస్నిక్, రవీనా ఖురానా పెళ్లి చేసుకున్నందుకు సంతోషంగా ఉంది. నేను 1984లో ముకుల్‌ను, 1985లో రవీనాను మొదటిసారిగా కలిశాను. వారిద్దరు పెళ్లి చేసుకోవడం సంతోషించదగ్గ విషయం. మేమంతా కలిసి గతంలో మాస్కోలో జరిగిన వరల్డ్ యూత్ స్టూడెంట్స్ ఫెస్టివల్‌కు హాజరయ్యామంటూ' తివారీ ట్విటర్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.

లాబీయింగ్ నేతలతో జీరోలుగా మారుతున్నాం

నేతల తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

హైదరాబాద్,మార్చి10(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో, ఢిల్లీలో కొందరు కాంగ్రెస్ నాయకులు లాబీయింగ్‌లు చేసుకుంటూ పార్టీకి నష్టం తెస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి మండిపడ్డారు. తెలంగాణలో తనలాంటి నాయకులు కొంతమంది హీరోలమైనా... ఢిల్లీలో లాబీయింగ్ చేసుకునే నాయకుల దగ్గర జీరోలుగా మిగిల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తమ దురదృష్టమని వాపోయారు. తెలంగాణ కాంగ్రెస్‌లో కొందరు ఢిల్లీ లాబీయింగ్ లో హీరోలు. ఇదే కాంగ్రెస్‌కు శాపం అంటూ వాపోయారు. సోనియా గాంధీ ఇప్పటికైనా జాగ్రత్తలు తీసుకుని పార్టీ బాగుపడేలా చూడాలని కోరారు. అయితే... లాబీయింగ్ చేసుకునే వాళ్లలో కొందరు పార్టీ లాభం కోరుకునే వాళ్ళు కూడా ఉన్నారని జగ్గారెడ్డి తెలిపారు. వాళ్ళు సోనియా గాంధీ దృష్టికి పరిస్థితిని తీసుకెళ్ళాలని కోరారు. వీహెచ్ లాంటి వాళ్లకు కూడా రాహుల్ గాంధీ అప్పాయింట్‌మెంట్ ఇవ్వకుండా ద్వారపాలకులు ఆపడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష నాయకుల కంటే సొంత పార్టీ లోని కొందరు నాయకులతోనే ఎక్కువ నష్టం జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మేలు జరుగుతుందని ఎదురుచూస్తున్నారన్నారు.

ఆదిత్య హాస్పిటల్ ఎండి ఆత్మహత్య

మేడ్చెల్,మార్చి10(ఆర్ఎన్ఎ): జిల్లాలో జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాప్రా సాకేత్ మిథులలో దారుణం చోటు చేసుకుంది. శ్రీ ఆదిత్య హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర కుమార్ అనుమాస్పదంగా మృతిచెందారు. దమ్మా యిగూడ లోని ప్లాట్ నంబర్ 57లో తన లైసెన్సు రివాల్వర్ తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలాన్ని డాగ్ స్క్వాడ్ క్లూస్ టీంతో పరిశోధించిన పోలీసులు.. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడు రవీంద్ర కుమార్ సిద్దిపేట వాసిగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన హోలీ వేడుకల్లో పాల్గొన్న ప్రజలు

హెచ్-1 వీసాల్లో మార్పులు

వచ్చే నెల నుంచే అమలు

న్యూఢిల్లీ,మార్చి9(ఆర్ఎన్ఎ): ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం వీసాల్లో చేసిన మార్పులు ఏప్రిల్ నుంచి అమల్లోకి రానున్నాయి. అప్లికేషన్లను కూడా వచ్చే నెల నుంచి స్వీకరించనున్నారు. అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ ఏటా 85వేల హెచ్-1బీ వీసాలను జారీ చేస్తోంది. వీటిల్లో అత్యధికంగా భారతీయులు పొందుతుండగా.. వారిలో కూడా 70శాతం ఐటీ ఉద్యోగులకే లభిస్తున్నాయి. ప్రస్తుతం 65,000 హెచ్-1బీ వీసాలు మాత్రమే జారీ చేస్తున్నారు. దీనికి అదనంగా అమెరికాలో ఉన్నత విద్య అంటే మాస్టర్స్ డిగ్రీ, అంతకంటే ఎక్కువ స్థాయి విద్య పూర్తి చేసిన మరో 20,000 మంది విదేశీ వృత్తినిపుణులకు వీటిని ఇస్తున్నారు. తొలుత కంపెనీలు ఎలక్ట్రానిక్(ఆన్‌లైన్) విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత వీసా ఫీజు కింద ప్రతి అప్లికేషన్‌కు 10 డాలర్లను చెల్లించాలి. కొత్త విధానం ప్రస్తుతం ఉన్న లాటరీ విధానంలో చాలా మార్పులు తీసుకురానుంది. ఈ రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌లో ఉద్యోగి, యజమానికి సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని మాత్రమే అడుగుతారు. లబ్దిదారు పూర్తిపేరు, పుట్టిన తేదీ వివరాలు, దేశం, పౌరసత్వం, లింగ సమాచారం, పాస్‌పోర్టు నంబర్ వంటి వాటితోపాటు జాబ్ ఆఫర్ లెటర్‌ను కూడా వారికి సమర్పించాల్సి ఉంటుంది. హెచ్-1బీ వీసాలు రిజిస్ట్రేషన్ సమయంలో యాదృచ్ఛికంగా స్క్రీనింగ్ చేస్తారు. ఆ తర్వాత ఎంపికైన వారికి యూఎస్‌సీఐఎస్ విషయం వెల్లడించి 90 రోజుల్లోపు హెచ్-1బీ వీసాకు పిటిషన్ పెట్టుకోవాలని సూచిస్తారు. ఈ పిటిషన్లను ఏప్రిల్ 1 నుంచి దాఖలు చేయవచ్చు. దీంతో ఎంపిక అయిన వారు మాత్రమే పిటిషన్ దాఖలు చేస్తుండటంతో చాలా ఖర్చు, శ్రమ మిగులుతున్నాయని యూఎస్‌సీఐఎస్ డిప్యూటీ డైరెక్టర్ మార్క్ కౌమన్స్ పేర్కన్నారు. హెచ్-1బీ వీసాలు అత్యధికంగా పొందే తొలి 30 కంపెనీల్లో అత్యధికంగా ఐటీ రంగానికి చెందినవే ఉన్నాయి. 2018లో 66శాతం ఈ వీసాలు కంప్యూటర్‌కు సంబధించిన ఉద్యోగాలు చేసేవారికే లభించాయి.

రేషన్ బియ్యం అమ్ముకుంటే కఠిన చర్యలు

అధికారుల హెచ్చరిక

మహబూబాబాద్,మార్చి10(ఆర్ఎన్ఎ): నిరుపేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి తప్ప అధిక ధరలకు అమ్ముకుని దుర్వినియోగం చేస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మాచన రఘునందన్ హెచ్చరించారు. రేషన్‌కార్డు ద్వారా పొందుతున్న బియ్యాన్ని ఎట్టి పరిస్థితిలోనూ అక్రమార్కులకు అమ్మకూడదని స్పష్టం చేవారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కేనముద్రం మండల ఇనుగుర్తిలో చౌకదుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దాదాపు మూడు రోజులుగా ఇలాతంటి తనిఖీలను నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని అమ్ముకుంటున్నడీలర్లను పట్టుకునేందుకు రఘునందన్ రేషన్‌తీసుకోవడానికి వచ్చిన సాధారణ వ్యక్తిలా ఒక రేషన్ దుకాణం ముందు నిలబడ్డారు. రేషన్‌డీలర్ చేస్తున్న అక్రమాలను గుర్తించిన ఆయన వెంటనే డీలర్‌ను పట్టుకున్నారు. వెంటనే అతని షాపులోని స్టాక్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉత్పత్తి పథకం ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థతో ఎంతో మంది పేదలు లబ్ది పొందుతున్నారని తెలిపారు. కొంత మంది డీలర్లు జనం వద్ద వేలి ముద్రలు తీసుకుని రేషన్ బియ్యం ఇచ్చే బదులు డబ్బులు ఇస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంలో నిజమెంతో తేల్చేందుకు రేషన్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నామని ఆయన వివరించారు. రేషన్‌డీలర్లు కార్డు దారులకు ఖచ్చితంగా ఈపాస్‌యంత్రంలో వచ్చిన రశీదును లబ్దిదారులకు ఇవ్వాలని సూచించారు. జనం కూడా అడిగి మరీ రశీదు తీసుకోవాలని అన్నారు. రేషన్ బియ్యాన్ని కార్డు దారుల వద్ద కొనుగోలు చేసి నల్లబజారుకు తరిలస్తేమాత్రం డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవడం ఖాయమని హెచ్చరించారు. ఇనుగుర్తి, మహమూద్‌పట్నంలోని రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. రేషన్ తీసుకోవడానికి వచ్చిన వారిని డీలరు సరిగ్గా రేషన్‌ఇస్తున్నాడా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు డీలర్లు సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు.

16నుంచి వాడని కార్డులు పనిచేయవు

న్యూఢిల్లీ,మార్చి9(ఆర్ఎన్ఎ): వినియోగదారులు నగదు రహిత, ఆన్‌లైన్ లావాదేవీలకు ప్రాధాన్యం ఇవ్వడంతో డెబిట్/క్రెడిట్ కార్డుల వినియోగం గణనీయంగా తగ్గిపోయింది. కొంతమందికి కార్డులు ఉన్నా వాటిని వినియోగించట్లేదు.

డెబిట్ కార్డులు లేదా క్రెడిట్ కార్డులు కలిగి ఉన్న కస్టమర్లు ప్రయోజనాల దృష్ట్యా మోసపూరితమైన లావాదేవీ అడ్డుకట్ట వేసేందుకు మార్పులు చేస్తూనే ఉంటాయి. ఆన్‌లైన్ లావాదేవీల కోసం మీ దగ్గరున్న డెబిట్ లేదా క్రెడిట్ కార్డులను ఇప్పటి దాకా వాడకపోయినట్లైతే ఈనెల 16 నుంచి అవి పనిచేయవు

. డెబిట్/క్రెడిట్ కార్డు లావాదేవీల భద్రత పెంపులో భాగంగా ఈ ఏడాది జనవరి 15న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఓ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.

మార్చి 16లోగా వినియోగించని కార్డులను నిరుపయోగం చేయాలని బ్యాంకర్లను..కార్డు మంజూరుదారులను ఆర్‌బీఐ ఆదేశించింది.

రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్(ఖీఈఎఐ) టెక్నాలజీ ఆధారంగా డెబిట్ లేదా క్రెడిట్ కార్డుల లావాదేవీలు పెరిగిపోతుండగా..ఈ సేవల్లో ఎలాంటి మోసాలకు తావులేకుండా వినియోగదారుల కోసం ఆర్‌బీఐ అనేక సెక్యూరిటీ జాగ్రత్తలు తీసుకుంటున్నది. ఈ నెల 16 నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా వాడని కార్డులు పనిచేయవని ఆర్‌బీఐ తెలిపింది.